RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

నిజం మా నైజం

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com

ఎడిటర్ : చింతల రామకృష్ణ   సంపుటి : 13   సంచిక : 156   బుధవారం, అక్టోబర్ 08 2025 ,   పేజీలు - 8   వెల : 3/-




# జూబ్లీహిల్స్ కాంగ్రెస్ టికెట్ దాదాపు ఖరారు

- సీఎం రేవంత్ మద్దతు,
- రేసు నుంచి తప్పుకున్న బొంతు రామ్మోహన్




**హైదరాబాద్ :** తెలంగాణలో రాజకీయంగా తీవ్ర ఉత్కంఠ రేపుతున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నిక తేదీ రానే వచ్చింది. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో తలెత్తిన ఈ బైపోల్స్ కోసం బీఆర్ఎస్ పార్టీ ఆయన భార్యను పోటీలో ఉంచనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఇక అధికార కాంగ్రెస్ సహా బీజేపీ పార్టీలు అభ్యర్థుల ఎంపికపై ఇంకా కసరత్తులు చేస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే రాష్ట్రంలో అధికారంలో ఉన్న హస్తం పార్టీ.. ఈ సీటులో ఎలాగైనా గెలవాలని పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలోనే అభ్యర్థి ఎంపిక విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో తాను జూబ్లీహిల్స్ ఉపఎన్నిక బరిలో లేనట్లు జీహెచ్ఎంసీ మాజీ మేయర్, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బొంతు రామ్మోహన్ సంచలన ప్రకటన చేశారు. దీంతో ఈ సీటు నవీన్ యాదవ్‌కే కన్ఫర్మ్ అవుతోందంటూ హస్తం పార్టీ శ్రేణుల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ తరఫున అభ్యర్థిగా నవీన్ యాదవ్ పేరు దాదాపు ఖరారైనట్లే తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై పార్టీ శ్రేణులతో మంగళవారం.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ ఈ నేపథ్యంలోనే జూబ్లీహిల్స్ రేసులో నుంచి తప్పుకున్నట్లు బొంతు రామ్మోహన్ ప్రకటించారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ హై కమాండ్ జూబ్లీహిల్స్ అభ్యర్థిని నిర్ణయిస్తుందని బొంతు రామ్మోహన్ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం తాను పనిచేస్తానని ఈ సందర్భ ంగా బొంతు రామ్మోహన్ ప్రకటించడంతో లైన్ క్లియర్ అయినట్లు కనిపిస్తోంది. మరోవైపు.. ఇదే జూమ్ మీటింగ్‌లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్.. ఏఐసీసీ సెక్రటరీలు, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కూడా పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ బైపోల్స్‌పై చేసిన సర్వే రిపోర్టులు, అభ్యర్థుల సామాజిక అంశాలపై ఈ సమావేశంలో నేతలు కూలంకషంగా చర్చించారు.

# బిగ్ బ్రదర్ ఎవరూ లేరు




**పాట్నా:** బిహర్ అసెంబ్లీ ఎన్నికలతేదీలను ఎన్నికల కమిషన్ ప్రకటించడంతో ఎన్డీయే లో సీట్ల షేరింగ్ ఫార్ములాపై ఆసక్తి నెలకొంది. కీలక భాగస్వామ్య పక్షాలైన జేడీయూ, బీజేపీ లు ఎక్కువ తక్కువల ప్రసక్తి లేకుండా సమంగా సీట్లు పంచుకుని సమష్టిగా పోటీకి దిగుతాయని ఆయా పార్టీ వర్గాల సమాచారం. ప్రస్తుతం సీట్ల షేరింగ్‌కు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయని, ఎన్ని సీట్లలో పోటీ చేస్తారనే దానిపై త్వరలోనే తుది నిర్ణయం ఉంటుందని చెబుతున్నారు. మొత్తం 243 సీట్లకు గాను 205 సీట్లను బీజేపీ-జేడీయూ సమంగా పంచుకుంటాయని, తక్కిన 38 సీట్లు ఎన్డీయే భాగస్వామ్య పక్షాలైన లోక్ జన్‌శక్తి పార్టీ హిందుస్థానీ అవామ్ మోర్చా , రాష్ట్రీయ లోక్ సమత పార్టీ కు కేటాయించనున్నాయని తెలుస్తోంది. చిరాగ్ పాశ్వాన్ ఎల్‌జేపీకి 25 సీట్లు, హెచ్ఏఎం నేత జితిన్ రామ్ మాంఝీకి 7 సీట్లు, ఉపేంద్ర కుష్వాహ ఆర్ఎల్ఎంకు 6 సీట్లు బీజేపీ ఆఫర్ చేసినట్టు చెబుతున్నారు. తమ పార్టీ నేతలకు నిర్దిష్ట నియోజకవర్గాలు కేటాయించాలని చిరాగ్ పాశ్వాన్ కోరుతుండటంతో చర్చలు కొనసాగుతున్నాయి. మరిన్ని సీట్లకు కూడా ఆయన పట్టుబడుతున్నారు. ఎల్‌జేపీకి మరిన్ని సీట్లు కేటాయిస్తే మాంఝీ, కుష్వాహలకు తక్కువ కేటాయింపులు జరుగుతాయి. చిన్న భాగసామ్య పార్టీలకు సీట్లు తగ్గితే వారికి రాజ్యసభ, లెజిస్లేటివ్ కౌన్సిల్ సీట్లు ఇస్తామని బీజేపీ ఆఫర్ చేసే అవకాశముందని చెబుతున్నారు. ఎన్నికల కమిషన్ నవంబర్ 6, 11 తేదీల్లో రెండు విడతలుగా పోలింగ్ ప్రక్రియను ప్రకటించింది. నవంబర్ 14న ఫలితాలు వెల్లడవుతాయి. ప్రస్తుత అసెంబ్లీ గడువు నవంబర్ 22తో ముగియనుండటంతో ఈలోపు ఎన్నికలు పూర్తిచేయడం ద్వారా సజావుగా అధికార మార్పిడి జరిగేందుకు ఈసీ పట్టుదలగా ఉంది. బిహార్ తొలి విడత పోలింగ్ గ్రామీణ, వరద ప్రభావిత ప్రాంతాలతో సహా సెంట్రల్ బిహార్‌లోని 121 నియోజకవర్గాల్లో జరగనుండగా, రెండో విడతలో 122 నియోజకవర్గాలకు పోలింగ్ జరుగుతుంది. ఈ విడతలో ప్రధానంగా సరిహద్దు ప్రాంతాలు ఉన్నాయి. నితీష్ కుమార్ సారథ్యంలోని ఎన్డీయే, ఆర్జేడీ సారథ్యంలోని 'ఇండియా' కూటమి మధ్య ప్రధాన పోటీ ఉండే అవకాశాలుండగా, ప్రశాంత్ కిషోర్ 'జన్ సురాజ్' సైతం ఎన్నికల బరిలో ఉంది. తొలిసారి ఆమ్ ఆద్మీ పార్టీ సైతం బిహార్‌లోని 243 నియోజకవర్గాల్లో పోటీకి సిద్ధమవుతోంది.

## బీఈ కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం




**ఉస్మానియా యూనివర్సిటీ :** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాసులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల బీఈ కోర్సుల రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. తమ మార్కు మెమోలను రెండు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు

# రైతులు అధైర్యపడొద్దు మేము అండగా ఉంటాం



**ఢిల్లీ, అక్టోబర్7:** పత్తి రైతులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి భరోసా కల్పించారు. రైతులు తక్కువ ధరకు పత్తిని బయట అమ్మవద్దని.. ఆలస్యమైన సీసీఐ పత్తిని కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. పత్తి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకి అమ్మాలని సూచించారు. 12 శాతం కంటే తక్కువ తేమ ఉన్న కాటన్ కార్పొరేషన్ కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. 122 పత్తి కొనుగోలు కేంద్రాలు ఉంటాయని..ఎవరైనా రైతులను మోసం చేస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కేంద్రం తరపున రైతులకు అండగా ఉంటామని మాటిచ్చారు. పత్తిని చివరి వరకు కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు. పత్తిలో తేమ 12 శాతం మించకుండా ఉండాలని సూచించారు. కాటన్ కొనుగోలు విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. 122 సెంటర్లలో పత్తి కొనుగోలు జరుగుతోందని తెలిపారు. తేమశాతం కొలిచే మిషన్లు కొనుగోలు కేంద్రాల్లో ఉంటాయని వెల్లడించారు. రైతులకు అండగా 122 సెంటర్లలోని కమిటీలు ఉండాలని ఆదేశించారు. ఇవాళ(మంగళవారం) కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌తో కిషన్ రెడ్డి ఢిల్లీలో సమావేశం అయ్యారు. తెలంగాణ పత్తి రైతుల సమస్యలపై కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌తో కిషన్ రెడ్డి చర్చించారు. తెలంగాణ పత్తి రైతుల సమస్యలపై గిరిరాజ్ సింగ్‌కి విజ్ఞాపనలు అందజేశారు కిషన్ రెడ్డి. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర జౌలి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ని తాను కలిశానని తెలిపారు. తెలంగాణ పత్తి రైతుల సమస్యలను వివరించానని పేర్కొన్నారు. తెలంగాణలో కేవలం పత్తి కొనుగోలు ద్వారా కేంద్ర ప్రభుత్వం ర.65 వేల కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. తెలంగాణలో మౌలిక వసతులు పెంచాలని సూచించారు. కాటన్ ఉత్పత్తి కేంద్రాలు పెంచాలని దిశానిర్దేశం చేశారు. మహారాష్ట్ర కోలలో హై డెన్సిటీ ప్లాంటేషన్ చేస్తున్నారని, తెలంగాణలో ఎందుకు చేయడం లేదని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తనను అడుగుతున్నారని చెప్పుకొచ్చారు. రైతుల్లో అవగాహన తీసుకురావాలని సూచించారు. రైతులకు విజ్ఞప్తి చేస్తున్న తక్కువ ధరకు పత్తి అమ్మవద్దని సూచించారు. పత్తిలో తేమశాతం తగ్గించే ప్రయత్నం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేయాలని సూచించారు.

# 125 సీట్లలో ఆర్జేడీ పోటీ

## వెలువడనున్న అధికారిక ప్రకటన



**పాట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి భాగస్వాముల మధ్య సీట్ల పంపకాలకు సంబంధించిన ఫార్ములా ఖరారైనట్టు సమాచారం. పాట్నాలో మంగళవారంనాడు జరిపే మీడియా సమావేశంలో సీట్ల కేటాయింపుపై అధికా రికంగా ప్రకటించేందుకు సన్నాహాలు జరుగుతు న్నాయి. కూటమిలో సీనియర్ భాగ స్వామిగా రాష్ట్రీయ జనతా దళ ఉండనుంది. కాంగ్రెస్ 55 నుంచి 57 సీట్లకు పరిమితం కానున్నట్టు తెలుస్తోంది. ఫార్ములా ఇదే. సీట్ల కేటాయింపు ఫార్ములా ప్రకారం ఆర్జేడీ 125 సీట్లలో పోటీ చేయనుండగా, కాంగ్రెస్ 55 నుంచి 57 సీట్లలో పోటీ చేస్తుంది. వామపక్ష పార్టీలకు 35 సీట్లు కేటాయిస్తున్నారు. ముఖేష్ సాహ్నీ వీఐపీ పార్టీకి 20 సీట్లు, పశుపతి పరస్‌కు 3 సీట్లు, జార్ఖండ్ ముక్తి మోర్చా కు రెండు సీట్లు కేటాయించనున్నారు. పంపకాల ప్రక్రియ సజావుగానే ఉందని కాంగ్రెస్, ఆర్జేడీ నేతలు చెబుతున్నప్పటికీ సీట్ల పంపకాలపై విభేదాలు ఇంకా తొలగలేదని చెబుతున్నారు. కాంగ్రెస్ 78 సీట్లు అడుగుతుండగా, 48 సీట్లు ఇచ్చేందుకు ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ సుముఖంగా ఉన్నారు. దీంతో మధ్యేమార్గంగా కాంగ్రెస్‌కు 55 సీట్లు వరకూ కేటాయించవచ్చని అంచనా వేస్తున్నారు. సంప్రదాయబద్ధంగా పోటీ చేస్తున్న కొన్ని సీట్లు కాంగ్రెస్ వదులుకునేందుకు సిద్ధంగా ఉందని తెలుస్తోంది. ఉదాహరణకు పాట్నా జిల్లాలో గత ఎన్నికల్లో నాలుగు సీట్లకు పోటీ చేసిన కాంగ్రెస్ ఈసారి ఆ సీట్లను కోరుకోవడం లేదు. దీంతో గతంలో కాంగ్రెస్ చేతిలో ఉన్న సీట్లు ఇప్పుడు ఆర్జేడీ ఖాతాలోకి వెళ్లనున్నారు. బరిలోకి జేఎంఎంబిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి జేఎంపీ ఎంట్రీ ఇస్తోంది. జార్ఖండ్ సరిహద్దు ప్రాంతాల్లో పోటీకి సిద్ధమవుతోంది. జేఎంఎం ఎక్కువ సీట్లు అడుగుతున్నప్పటికీ సీట్ల పంపకాల ఫార్ములా ప్రకారం ఆ పార్టీకి 2 సీట్లు కేటాయించే అవకాశం ఉంది.

# ప్రాణహిత - చెవెళ్ల ప్రాజెక్టుపై ప్రభుత్వం స్పెషల్ ఫోకస్



**హైదరాబాద్, అక్టోబరు7:** మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటి పారుదల శాఖఅధికారులతో (మంగళవారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ప్రకారం కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రాణహిత చెవెళ్ల ప్రాజెక్టుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఉద్ఘాటించారు. తుమ్మడిహట్టి వద్ద రెండు ప్రత్యామ్నాయ మార్గాలపై పరిశీలిస్తున్నట్లు చెప్పుకొచ్చారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టు 2027 నాటికి పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని నొక్కిచెప్పారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్లా బ్యారేజీల పునరుద్ధరణలో ఐఐటీని భాగస్వామ్యం చేస్తామని వెల్లడించారు. వర్షాకాలం అనంతరం రూపకల్పన చేసి ఒక సంవత్సరంలో వీటిని పూర్తి చేస్తామని పేర్కొన్నారు. అలాగే, కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ - విచారణ పురోగతిపై సమీక్షించారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. సమ్మక్క సారక్క ప్రాజెక్టు, దేవదుల ప్రాజెక్టులపై సమీక్షించారు. భూ సేకరణ పరిహారంగా రూ.33 కోట్లు విడుదల చేయాలని మంత్రి ఆదేశించారు. డిండి ప్రాజెక్టుపై మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. రిజర్వాయర్ల సామర్థ్య పెంపు కోసం కొత్త విధానం సిద్ధం చేయాలని మార్గనిర్దేశం చేశారు. ఐఎస్‌డబ్ల్యూఆర్డ్, సీడీఓ బలోపేతంపై ఈ సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించాలి..అలాగే, పౌరసరఫరా శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశం నిర్వహించారు. వర్షాకాలం ధాన్యం కొనుగోలుపై సమీక్షించారు. ధాన్యం దిగుబడిలో తెలంగాణ రికార్డ్ సాధించిందని తెలిపారు. 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని వివరించారు. 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధం చేశామని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 67.57 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోందని చెప్పుకొచ్చారు. 40.75 లక్షల ఎకరాల్లో సన్నాలు వేశారని వివరించారు. 26.82 లక్షల ఎకరాల్లో దొడ్డు వడ్ల సాగవుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బియ్యం సబ్సిడీ రూ.6,500 కోట్లు తక్షణమే విడుదల చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

# గ్రూప్-1 నియామకాలపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరణ



**హైదరాబాద్ :** తెలంగాణ గ్రూప్-1 నియామకాలపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. రాష్ట్ర హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చే తుది ఉత్తర్వులకు అనుగుణంగా నియామకాలు ఉండాలని స్పష్టం చేసింది. గ్రూప్-1 నియామకాలపై ఇటీవల హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై పలువురు అభ్యర్థులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులకు అనుగుణంగా ఎంపిక అయిన వారికి నియామక పత్రాలు అందిచడంపై స్టే ఇవ్వాలని వారు కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయమాల్య బాగ్జిల ధర్మాసనం విచారణ జరిపింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై డివిజన్ బెంచ్ మధ్యంతర ఆదేశాలు ఇవ్వడంపైనా అభ్యర్థుల తరఫు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. వాదనల అనంతరం స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. విచారణ ముగించి తగిన ఆదేశాలు ఇవ్వాలి : ఈ కేసుకు సంబంధించిన ప్రధాన పిటిషన్లు అన్నీ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో ఈనెల 15న విచారణకు రానున్న నేపథ్యంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరిసున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఈలోగా చేపట్టిన నియామకాలు అన్ రిట్ అప్పీల్స్‌పై ఇచ్చే ఫలితానికి లోబడి ఉంటాయని, హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పాటించాలని ధర్మాసనం సూచించింది. అవకాశం ఉన్నంత త్వరగా పిటిషన్లపై విచారణ ముగించి తగిన ఆదేశాలు ఇవ్వాలని ధర్మాసనం సూచించింది. ఈ కేసుకు ప్రాధాన్యత ఇచ్చి విచారణ పూర్తి చేయాలని సూచిస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై విచారణను ధర్మాసనం ముగించిందినియామకపత్రాలు ఇచ్చేసిన ప్రభుత్వం: గ్రూప్-1కు ఎంపిక అయిన మొత్తం 562 మందికి గత నెల 27న సీఎం రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందించిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ శిల్పకళావేదికలో ఎంపికైన అభ్యర్థులతో ఉద్యోగ ప్రమాణం చేయించారు. విధుల్లో నిజాయతీ, నిబద్ధతతో వ్యవహరిస్తామని సీఎం ప్రమాణం చేయించారు. గ్రూప్-1 నియామక పత్రాలు అందుకుని విధుల్లో చేరుతున్న వారు సేవాభావంతో ముందుకు సాగాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

# జూబ్లీహిల్స్‌పై చంద్రబాబు ఫోకస్

## తెలంగాణ టీడీపీ నేతలతో కీలక భేటీ



**హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ విడిపోయిన తర్వాత ఏపీలో రెండుసార్లు అధికారంలోకి వచ్చిన తెలుగు దేశం పార్టీ.. తెలంగాణలో మాత్రం రోజురోజుకూ ప్రాభవాన్ని కోల్పోతోంది. అడపాదడపా ఏదో ఒక ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులను దింపినా.. ఘోర పరాభవాలే ఎదురవుతున్నాయి. అయితే 2018లో కాంగ్రెస్ పార్టీతో కలిసి తెలుగుదేశం మహా కూటమి పేరుతో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసినా.. ఘోర పరాజయమే చవిచూసింది. ఈ క్రమంలోనే పూర్తిగా ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై దృష్టి సారించిన తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు.. అవకాశం వచ్చిన ప్రతీసారి తెలంగాణలో పార్టీని బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నా.. అవి ఫలించడం లేదు. హైకమాండ్ పట్టించుకోకపోవడంతో.. తెలంగాణలోని తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు ఇతర పార్టీల్లో చేరిపోయారు. ఇంకా ఉన్న కొందరు నేతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం జూబ్లీ హిల్స్ ఉపఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంతో.. తెలుగుదేశం పార్టీ అలర్ట్ అయింది. ఈ ఎన్నికల్లో పోటీ చేయాలా వద్దా అనేది తేల్చుకునేందుకు పార్టీ అధినేత చంద్రబాబుతో భేటీ అయ్యేందుకు తెలంగాణ తెలుగుదేశం నేతలు.. ఇవాళ ఉండవల్లిలోని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నివాసానికి చేరుకుని. సమావేశం అయ్యారు. జూబ్లీ హిల్స్ ఉపఎన్నికతోపాటు.. తెలంగాణలో స్థానిక చంద్రబాబు చర్చలు జరిపారు. నవంబర్ 11వ తేదీన జూబ్లీహిల్స్ బైపోల్స్ జరగనుండగా.. అక్కడ టీడీపీకి కొంత క్యాడర్ ఉండటంతో ఏం చేయాలి అనేదానిపై సమాలోచనలు జరుపుతున్నారు. దీంతో అక్కడి నుంచి మళ్లీ పార్టీని విస్తరించాలని తెలుగుదేశం నేతలు ప్రణాళికలు రచిస్తున్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన 2014లో జరిగిన తొలి ఎన్నికల్లో తెలంగాణలో టీడీపీ పార్టీ 15 స్థానాల్లో విజయం సాధించింది. ఆ తర్వాత పలువురు టీడీపీ ఎమ్మెల్యేలు అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

## దంచి కొట్టిన వర్షం చెరువును తలపించిన రోడ్లు




**తూప్రాన్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి నవీన్ :** మెదక్ జిల్లా తూప్రాన్ లో వర్షం దంచి కొట్టడం తో పట్టణం లోని రోడ్లన్ని చెరువులను తలపించాయి. మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో పట్టణం లో వ్యాపార, రవాణా వ్యవస్థ చెల్లా చేదురైంది. మంగళవారం తూప్రాన్ పట్టణం లో వారంతపు సంత కావడం తో మార్కెట్ లో విక్రయ దారులు, కొనుగోలుదారుల రద్ది సమయంలో ఒక్కసారిగా ఉరుములు మెరుపులు, ఇదురు గాలులతో కూడిన వర్షం రావడం తో మార్కెట్ లో చిరు వ్యాపారులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. గాలివానకు విక్రయ దారుల డేరా లు చెల్లా చేదురయ్యాయి. ఇక మున్సిపల్ లోని ప్రధాన రహదారి పై మోకాళ్ళ వరకు నీరు నిలిచిపోవడం తో వాహన దారుల రాకపోకలకు ఇబ్బంది కలిగి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సాయంకాలం సమయంలో వారంతపు సంత కావడం తో పట్టణ ప్రజలు మార్కెట్ కు రాగ ఉరుములతో కూడిన భారీ వర్షం తో భయం భయం గా ఎటు పోవాలో అర్థం కాక అవస్థలు పడ్డారు. గత నెలలో కురిన వర్షం మరువకముందే మళ్ళీ వర్షం రావడం తో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఆందోళన కు గురయ్యారు. అకాల వర్షం వల్ల వారపు సంత లో కూరగాయలు, నిత్యావసర సరుకుల చిరు వ్యాపారులకు నష్టాన్ని మిగిల్చిందని అన్నారు.

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చర్లపల్లి డివిజన్ పరిధిలోని బి ఎన్ రెడ్డి నాగర్, ఈ సి నాగర్, వి ఆర్ కాలని లకు కోటి రూపాయల పనులు మంజూరు




**కప్రా మండల వాస్తవ తెలంగాణ న్యూస్/**మేడ్చల్ జిల్లా కాప్రా మండలం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు బి ఆర్ పార్టీ నాయకులు చర్లపల్లి బి ఆర్ ఎస్ నాయకులు ఈ రోజు బి ఎన్ రెడ్డి కాలనీ లో కాలనీ వాసుల తో కలిసి సి సి రోడ్డు పనులను పర్యవేక్షించడం జరిగింది. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చర్లపల్లి డివిజన్ కి అధిక నిధులను మంజూరు చేయడం జరిగింది. నిరవధికంగా ఎప్పటికప్పుడు డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఎన్ రెడ్డి కాలనీ అధ్యక్షుడు దామోదర్ చారి, సుభాస్, నవీన్, సత్యనారాయణ, మూర్తి, బిక్షపతి, రంజిత్ కుమార్ ,బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు నేమూరి మహేష్ గౌడ్ ,డప్పు గిరి బాబు, బొడుగ రాజు, కొల నరేష్, వేణు గోపాల్ రెడ్డి, కొమ్ము రమేశ్, బాలరాజు, కోటేశ్ , నయీం, రెడ్డి నాయక్ , రాజు, ఆంజనేయులు, లోక్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిలో చేరిన యువతి




**వాస్తవ తెలంగాణ వెల్దుర్తి మండలం అక్టోబర్ 07** మంగళవారం వెల్దుర్తి మండల్ పెద్దాపూర్ గ్రామానికి చెందిన కండక్టర్ యాదగిరి కూతురు అమూల్య నరేంద్ర మోడీ చేస్తున్న సంక్షేమ పథకాలకు అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై మెదక్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు చేతిలో మీదుగా భారతీయ జనతా పార్టీలో చేరడం జరిగింది ఈ సందర్భంగా తను మాట్లాడుతూ రాజకీయాల్లో ఎంపీ రఘునందన్ రావు ని ఆదర్శంగా తీసుకొని తన భవిష్యత్ రాజకీయం ప్రజాసేవ కోసం పనిచేస్తారని వారు చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దాసు సీనియర్ నాయకులు అంగడిపేట శ్రీనివాస్ గౌడ్ బూత్ అధ్యక్షులు అభిలాష్ తదితరులు ఉన్నారు..

## సదాశివపేట పట్టణం 8 వ వార్డు హనుమాన్ నగర్ కాలనీ వాసుల సమస్యలకు స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఐ ఏ ఎస్




**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్**
సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో తేది 7 10 2025.నాడు 8 వ వార్డు హనుమాన్ నగర్ కాలనీలో కాలనీవాసులు రోడ్లు బాగోలేక రోడ్డుపై ధర్నా నిర్వహించారు మున్సిపల్ కమిషనర్ కు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని అలాగే స్థానిక ఎమ్మెల్యే కూడా పట్టించుకోవడంలేదని రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు స్థానిక వాసులు మాట్లాడుతూ ఈ రోడ్డు వెంబడి వెళ్లే కాలనీ వాసులకు చాలా ఇబ్బందికరంగా మారింది అని వర్షాలు పడితే ఆటోలు గానీ ద్విచక్ర వాహనాలు కానీ పోవడానికి చాలా ఇబ్బందికరంగా మారిందన్నారు ఇక్కడ శ్రీ శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం మరియు పాఠశాలలు మాహత్మ జ్యోతి బాపూలే రెసిడెన్షియల్ బాలికల వసతి గృహము ఉన్నాయి పాఠశాలల బస్సులు వెళ్లాలంటే ఈ రోడ్డు వెంబడి అని అన్నారు వర్షాకాలం వస్తే చాలు రోడ్డు పైనే ఆటోలు వదిలేసి వెళ్లిపోతారు కాలినడకన కాలనీలోకి రావాల్సి వస్తుందని అన్నారు ఇప్పటికే నలుగురు స్థానికులకు ద్విచక్ర వాహనాలు నుంచి పడి కాళ్లు చేతులు విరిగి హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు అన్నారు అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పట్టించుకోని పరిస్థితి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన అధికారులు నిర్లక్షం వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు గత 20 సంవత్సరాల నుండి 250 కుటుంబాలు హనుమాన్ నగర్ లో మునిసిపాలిటీ కు టాక్స్ లు కడుతున్న అధికారులు స్పందించట్లేదన్నారు మాకు వీలైనంత త్వరగా రోడ్డు నిర్వహించాలని అన్నారు అనంతరం జిల్లా కలెక్టర్ కు స్థానికులు వినతి పత్రం అందజేసి సమస్యలు తెలియజేశారు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య స్పందించి వారం రోజులు గడువు లో పట మీ సమస్యకు పరిష్కారం చేయిస్తామని హామీ ఇచ్చారు.

## విద్యార్థుల హాజరును ఎఫ్.ఆర్.ఎస్ యాప్ లో ఆన్ లైన్ చేయాలి.ఎన్.శంకర్

- మండల విద్యాధికారి





**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్**
సంగారెడ్డి జిల్లాసదాశివపేట పట్టణంలో గల ప్రభుత్వ రవీంద్ర మోడల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించడం జరిగిందని మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు.పాఠశాలలో తరగతి వారీగా విద్యార్థుల హాజరు శాతం పరిశీలించగా ఆన్ లైన్ లో విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉంది, ప్రతి తరగతి వారిగా సంబంధిత టీచర్, తరగతి లోని విద్యార్థుల ఫేషియల్ అటెండెన్స్ ఆన్ లైన్ తొందరగా పూర్తిచేయాలని, ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టి తీసుకురావాలని తెలిపారు,తరగతి వారీగా విద్యార్థుల విషయం వారీగా సామర్థ్యాన్ని పరిశీలించగా కొందరు విద్యార్థులు చదవడం మరియు వ్రాయడంలో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు,మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించడం జరిగిందని మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు,ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్.ఎం సరిత,సిఆర్పి రాజేశ్వర్ మరియు టీచర్స్ పాల్గొన్నారని మండల విద్యాధికారి తెలిపారు.

## ఒక ఉపాధ్యాయుని చేతిలో ఎంతోమంది బాగుపడ్డారు కానీ తన కొడుకు మాత్రం జీవనోపాధి కోసం గవర్నర్ కు ముఖ్యమంత్రి ఆర్థిక సాయం కోసం ఓ నిరుద్యోగి గా విన్నపించిన కనికరించని ప్రభుత్వంలి

- జీవనోపాధి కోసం హైదరాబాదు వలస




**మెదక్ జిల్లా మాసాయిపేట అక్టోబర్ 7. వాసవి తెలంగాణ**
మెదక్ జిల్లా మాసాయిపేట మండలంలోని ఒక నిరుపేద కుటుంబంలో కటిక దరిద్రం లో ఉన్నటువంటి వ్యక్తి కథ మాసాయిపేట మండల కేంద్రంలోని రాధాకృష్ణ అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులు మరోవైపు ఉద్యోగం లేదు. ఉపాధి కోసం నాలుగు సంవత్సరాల క్రితం హైదరాబాద్ వలస వెళ్లిన వ్యక్తి ఎన్నో తిప్పలు పడి ఒక ప్రైవేటు ఆఫీసులో ఆఫీసు అసిస్టెంట్గా చేరి గత నాలుగు సంవత్సరాలు 13,500 జీతంతో హైదరాబాద్ నగరంలో బత్కేల్ల తీస్తున్నారు. గత ఏడాది ఉద్యోగులను తొలగించే క్రమంలో ఆఫీసులో ఉద్యోగం నుంచి నాలుగు సంవత్సరాలు ప్రాబడెంట్ పండు ఈఎస్ఐ కట్ చేయకుండా జీతం మరియు ఎలాంటి ఆర్థిక సపోర్టు లేదని ఆవేదన వ్యక్తం చేసిన రాధాకృష్ణ అక్కడితో ఆగకుండా ప్రధానమంత్రి కార్యాలానికి తెలంగాణ ముఖ్యమంత్రి కి చాలా సార్లు ఆర్థిక సాయం కోసం విన్నవించుకున్నానని అలాగే తెలంగాణ గవర్నర్ కు కూడా ఆర్థిక సాయం కోసం విన్నవించుకునానని మాసాయిపేట నివాసి రాధాకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు.ఎక్కడి నుంచి ఆర్థిక సాయం అందకపోవడంతో అత్యంత దుర్భరమైన దుస్థితిలో ఉన్నాను అని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకపక్క కటిక పేదరికం మరోపక్క తినడానికి కూడా ఇబ్బంది ఇలాంటి పరిస్థితుల్లో ఆదుకోవలని ముఖ్యమంత్రి కార్యాలయం లో ఉత్తరాలు ట్విట్టర్లు మెయిల్ ద్వారా ఎన్నో పర్యాయాలు ఆర్జీ పెట్టుకున్న ఇంతవరకు సమాధానం రాలేదు అనిఅన్నారు. ఒక రాష్ట్రంలో ఒక వ్యక్తికి ఇబ్బంది వస్తే ఆదుకోవాల్సింది ఆ రాష్ట్రాన్ని పరిపాలించే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరి నేను పెట్టుకున్న ఆర్జీలు ముఖ్యమంత్రి దాకా వెళ్లడం లేదా లేక అధికారులు చూసి దాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం లేదా అని అన్నారు. నేను ఇచ్చినా పిర్యాదులు ప్రశ్నగానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. ముఖ్యమంత్రి ఆయన విచక్షణ అధికారము ఉపయోగించి ఆర్థిక సాయం చేయగలరని పత్రికా ముఖంగా వేడుకుంటున్నాను. అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక పేదవాన్ని ఆదుకోండి ఒక కుటుంబాన్ని నిలబెట్టండి గ్రామంలో అనేకమైన ఆర్థిక ఇబ్బందులు అప్పులు ఉన్న నివాసం ఉన్న ఇల్లు భారీ వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్నది విపత్తు నివారణ కింద ఎలాంటి డబ్బులు రాలేదు తల్లి తండ్రి ఎలాంటి బ్యాగ్ సపోర్ట్ లేదుఅని ఒక సామాన్య వ్యక్తిని ఎలాంటి రాజకీయ పలుకుబడి గాని ఎలాంటి రాజకీయ అండర్ దండలు గాని లేనటువంటి చివరగా చెప్పాలంటే ఒక కామన్ మ్యాన్ ని ఒక పేద వ్యక్తిని ఆదుకోవాల్సిన బాధ్యత తెలంగాణ ప్రభుత్వానికి లేదా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. అలాగే ప్రస్తుతం మెదక్ ఎంపీ రఘునందన్ రావు, టిఆర్ఎస్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, మరియు కాంగ్రెస్ నర్సాపూర్ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి ఆర్థిక సాయం చేసి నన్ను ఆదుకోండి అని విజ్ఞప్తి చేశారు.

## జరుగుతున్నా పనులను పరిశీలించి, నూతన 130 మీటర్ల యు జి డి పనులను ప్రారంభించినా కార్పొరేటర్ బొంతు శ్రీదేవి.

- ప్రతి పనిని దగ్గరుండి పరిశీలించినా కార్పొరేటర్





**కప్రా మండల వాస్తవ తెలంగాణ న్యూస్** మేడ్చల్ జిల్లా కాప్రా మండలం చర్లపల్లి డివిజన్లో ని బి ఎన్ రెడ్డి కాలనీలో జరుగుతున్న 400 మీటర్ల రహదారి పనులను అధికారులు మరియు బి ఎన్ రెడ్డి కాలనీ అధ్యక్షుడు దామోదర చారి బృందం తో స్టాండింగ్ కౌన్సిల్ సభ్యురాలు కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పర్యటించారు. పనులు నాణ్యత తో వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే చర్లపల్లి డివిజన్ లోని విఆర్ కాలనీ లోని శ్రీరామ్ నగర్ కాలనీలో 130 మీటర్ల యు జి డి పనులను ప్రారంభించి అధికారులతో మరియు కాలనీ వాసులతో స్వయంగా జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్

# కప్రా మున్సిపాలిటీ ఇంటి నిర్మాణ అనుమతుల్లో కనబడుతున్నా గోల్ మాల్

- అనుమతుల్లో ఉన్నది ఒకటి, నిర్మాణం చేసేది మరొక్కటి
- నివాసానికి అనుమతులు, వ్యాపార సముదాయంగా నిర్మాణం
- తూతూ మంత్రంగా సోకాజ్ నోటీసులు, పనులు యథాతథం




**కప్రా మండల వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్రా మున్సిపాలిటీ లో ఇంటి నిర్మాణ లలో అంతులేని విధంగా అవకతవకలు చాలా జరుగుతున్నాయి. ఎక్కడో ఒక చోట పత్రిక విలేకర్లు ప్రశ్నించినప్పుడు తూతూ మంత్రంగా సోకాజ్ నోటీసులు ఇచ్చిసే చేతులు దులుపు కొంటున్నారు.నోటీసులు ఇచ్చినా ఎదవిదిగా అక్రమ నిర్మాణాలు జరుగుతూనే ఉంటాయి. నోటీసులు కాగితాలకే పరిమిత మయ్యాయి. అక్రమ నిర్మాణా దారులకు మున్సిపాలిటీ అధికా రాలు అంటే లెక్కలేనట్టుగా , అవహేళనగా మారాయి. ఇందుకు కారకులు ఎవరూ అనేది పునరాలోచన కప్రా మున్సిపాలిటీ అధికారులు చేయాలి. ఇలాంటి విధానాల వల్ల అధికారులు అవినీతికి పాల్పడుతున్నారా? అని మున్సిపాలిటీ ప్రజలు కు అనుమానాలు కలుగుతున్నాయి. ఇలాంటి వార్త కథనాలు కో కొల్లలు గా వచ్చినప్పటికీ ఎంతవరకు చర్యలు తీసుకుంటున్నారు అనేది ప్రశ్నార్థకం. అయిన వీటిపై విచారణ చేసేది ఎన్నడ ూా?అందుకు అనుగుణంగా చర్యలు తీసుకునేది ఎన్నడూ ?అని మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు. ఇప్పటి కైనా అధికారులు స్పందించి ప్రతి అక్రమ నిర్మాణాల పై పైలెట్ ప్రాజెక్ట్ తరహా లో విచారణ చేపట్టాలని, మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు.

# టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ నిర్లక్ష్యం

- అనుమతి లేకున్నా అక్రమ కట్టడాలు నిర్మాణం
- ముడుపుల కోసమే మౌనమా...?
- గుండ్లపోచంపల్లిలో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలే
- ప్రభుత్వ ఆదాయానికి పడుతున్న గండి !





**మేడ్చల్ వస్తావా తెలంగాణ.** గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పరిధిలోని అక్రమ భవనాలు, యదేచ్ఛగా నిర్మిస్తున్నప్పటికి గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ పట్టించుకోవడం లేదని విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.





ఇదిలా ఉంటే ఈ అక్రమ భవనాలు నిర్మించడంతో బిల్డర్లు రెచ్చిపోయి పురపాలక సంఘం అనుమతి లేకపోయినప్పటికి అంతస్థులకు పైగా భవనాలు నిర్మిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పురపాలక సంఘం అనుమతి తీసుకున్న తర్వాతనే భవనాలు నిర్మించాలి. కానీ ఇవేమి లేకుండానే అక్రమ నిర్మాణదారులు ఇష్టానుసారంగా భారీ భవనాలను నిర్మిస్తున్నారు. అక్రమ భవనాలు నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవని పురపాలక సంఘం అధికారులు హెచ్చరిస్తున్నప్పటికి బిల్డర్లు తమ ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలను నిర్మిస్తున్నారనే ఆరోపణలు జోరుగా నిపిస్తున్నాయి. గృహ నిర్మాణం అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో అనుమతి రాకున్నా ఇళ్లు నిర్మాణం చేపట్టిన అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత టౌన్ ప్లానింగ్ శాఖ సూపర్వైజర్ మామూళ్ల మత్తులో జోగుతూ అక్రమ నిర్మాణదారులకు వత్తాసు పలకడంతో ప్రభుత్వ ఆదాయానికి వారే దగ్గరుండి గండి కొట్టిస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పురపాలక శాఖ పరిధిలో గృహ నిర్మాణ అనుమతులను టీఎస్ బీపాస్ ద్వారా తీసుకుని ఆ తర్వాత నిర్మాణాలను చేపట్టాలని చట్టం తెలుపుతున్న టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ అండదండలతో అవేమీ పట్టించుకోకుండా అనుమతులను తీసుకోకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. టీఎస్ బీపాస్ ద్వారా అనుమతి తీసుకోవాలంటే ప్లాటుకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉంటే సత్వరమే సంబంధిత అనుమతులు ఇస్తారు. ఆర్ అండ్ బీ అధికారులు స్థలాన్ని పరిశీలించి టౌన్ ప్లానింగ్ సిబ్బంది ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేసి అన్ని సవ్యంగా ఉంటే పురపాలక శాఖ కమిషనర్ లాగిన్ కు పంపిన తర్వాత సంబంధిత నిర్మాణానికి అనుమతి మంజూరు చేస్తారు. ఈ అనుమతి పొందిన మేరకే ఇంటి నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం కాకుండా చట్టవిరుద్ధంగా ఇళ్ల నిర్మాణం జరిగితే మూడు రోజుల్లోనే ఆ ఇంటి నిర్మాణం కూల్చి వేసి నిర్మాణ ఆస్తి విలువలో 25 శాతం భవన నిర్మాణం యజమాని నుంచి సంబంధిత శాఖ వసూలు చేస్తారు. ఎల్ఆర్ఎస్ అనుమతులు లేకుండా నిర్మాణం చేపడితే నిషేధిత ఆస్తి జాబితాల్లో దాన్ని చేర్చి విద్యుత్, నల్లా కనెక్షన్ తో పాటు ప్రభుత్వం కల్పిస్తున్న ఇతర సేవలను నిలిపివేస్తారు. ఇళ్లను తనిఖీ చేసేందుకు వెళ్లినప్పుడు అనుమతులు అతిక్రమించి నిర్మిస్తే ఆ నిర్మాణానికి సంబంధించి ఫోటోలు తీసి వీడియో రికార్డు చేసి పంచనామా చేస్తారు. కానీ ఇవేమీ పట్టించుకోకుండా గ్రౌండ్ ఫ్లోర్ తో పాటు రెండు అంతస్తులకు అనుమతి తీసుకుని అదనంగా రెండు, మూడంతస్తుల వరకు నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికైన గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పరిధిలో చేపడుతున్న అక్రమ భవన నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవడంతో పాటు గుండ్లపోచంపల్లి టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ పై ఉన్నతాధికారులు క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం ప్రజలు కోరుతున్నారు.

# పార్టీ గుర్తింపుపై హైకోర్టును ఆశ్రయించిన తీన్మార్ మల్లన్న



**హైదరాబాద్, అక్టోబర్ 7:** తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) తెలంగాణ హైకోర్టును ఆశ్రయిం చారు. రాజకీయ పార్టీ గుర్తింపు, గుర్తుపై హైకోర్టులో మల్లన్న పిటిషన్ దాఖలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలు కల్పించాలని పిటిషనర్ నవీన్ కోరారు. ఈ పిటిషన్‌పై (మంగ ళవారం) హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషనర్ అభ్యర్థనను పరిశీలించి చట్ట ప్రకారం చర్యలు తీసుకో వాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.కాగా.. తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు, రాజ్యాధికారం లక్ష్యంగా ఇటీవల తెలంగాణ రాజ్యాధికార పార్టీని తీన్మార్ మల్లన్న స్థాపించిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 17న తాజ్ కృష్ణ హోటల్‌లో పార్టీని స్థాపిం చారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండాను ఎరుపు, ఆకుపచ్చ రంగుల్లో రూపొందించారు. జెండా మధ్యలో పిడికిలి బిగించిన చేయితో పాటు కార్మిక చక్రం, వరి కంకులు ఉన్నాయి. జెండాపై భాగంలో ఆత్మగౌరవం, అధికారం, వాటా నినాదాలను రాశారు. పిడికిలి కింది భాగంలో పార్టీ పేరును ముద్రించారు.అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని న్యాయస్థానాన్ని మల్లన్న కోరడం.. చట్టపరంగా చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో. మల్లన్నకుఎన్నికల సంఘం ఎలాంటి గుర్తును కేటాయిస్తుందో చూడాలి మరి.

# కాంగ్రెస్ ధోకా కార్డుపై బీఆర్ఎస్ నేతల రియాక్షన్




**హనుమకొండ, అక్టోబర్ 7:** కాంగ్రెస్ ధోకా కార్డు విడుదలపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలుతీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బాకీ కార్డుకు సమాధానం చెప్పలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. (మంగళవారం) మాజీ ఎమ్మెల్యే, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు వినయ్ భాస్కర్ మీడియాతో మాట్లాడు తూ.హైడ్రా పేరుతో ఇళ్లను కూల్చివేస్తున్నా రని మండిపడ్డారు. రైతులకు యూరియా దొరకడం లేదని తాము నిరసనలు చేస్తుంటే... కాళేశ్వరం రిపోర్టు తెరపైకి తెచ్చారని విమర్శిం చారు. కాంగ్రెస్ కుట్రలను తిప్పి కొడతామని స్పష్టం చేశారు. ప్రజలకు ఉన్న బాకీ కార్డుతో గుర్తు చేస్తే... ధోకా కార్డును తెరపైకి తెస్తున్నారని మండిపడ్డారు. అమలు కానీ హామీలతో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని వినయ్ భాస్కర్ ఆరోపణలు గుప్పించారు.ప్రజలకు ధోకా చేసిందే కాంగ్రెస్: రాజయ్యపులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్టు కాంగ్రెస్ ధోకా కార్డు విడుదల చేసిందని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య వ్యాఖ్యలు చేశారు. అలవికానీ హామీలు ఇచ్చి ప్రజలకు అసలు ధోకా చేసిందే కాంగ్రెస్ అన్నారు. కాంగ్రెస్ తీరు దొంగే దొంగా అన్నట్టుగా ఉందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలపై కాంగ్రెస్ కపట ప్రేమ చూపుతోందన్నారు. బీసీ కార్డుతో లబ్ది పొందాలని ప్రభుత్వం చూస్తోందని అన్నారు. జనాభా లెక్కలు చూడకుండా ఇష్టం వచ్చినట్లు రిజర్వేషన్లు ఖరారు చేశారని ఫైర్ అయ్యారు. బీసీ రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అభ్యర్థులు దొరకడం లేదన్నారు. కేసీఆర్ పథకాలే తప్ప... కాంగ్రెస్ చేసిందేమీ లేదని వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అంటే కమీషన్, కాంగ్రెస్ అంటే కరెన్సీ, కాంగ్రెస్ అంటే కుంభకోణం అని అన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే అమలవుతున్నాయని ధర్మారెడ్డి పేర్కొన్నారు.

# 9న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఛలో బస్ భవన్



**హైదరాబాద్, అక్టోబరు7:** ఆర్టీసీ చార్జీల పెంపునకు నిరసనగా ఈ నెల 9వ తేదీన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఛలో బస్ భవన్ కి పిలుపునిచ్చినట్లు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఛలో బస్ భవన్ ధర్నాలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో సహా.. బీఆర్ఎస్ నేతలు పాల్గొంటారని తెలిపారు.(మంగళవారం) తెలంగాణ భవన్‌లో మీడియాతో తలసాని శ్రీనివా స్ యాదవ్ మాట్లాడారు. నందినగర్ నుంచి కేటీఆర్.. మెహిదీపట్నం నుంచి హరీశ్‌రావు బస్సులో ప్రయాణం చేసి బస్ భవన్‌కి చేరుకుంటారని చెప్పుకొచ్చారు తలసాని శ్రీనివాస్ యాదవ్.పెంచిన బస్సు చార్జీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం అంటూనే.. వాళ్ల కుటుంబ సభ్యులపై భారం వేయడం అన్యాయమని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి కోల్పోయిన వారి సంఖ్యనే ఎక్కువని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ పడిపోయిందని ఆరోపించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ మేనిపె స్టోలో కూడా చెప్పిందని గుర్తుచేశారు తలసాని శ్రీనివాస్ యాదవ్.గౌలిగూడ బస్ డిపోను రూ.400 కోట్లకు ప్రైవేట్ వాళ్లకి ఇచ్చారని ఆరోపించారు. మియాపూర్, ఉప్పల్‌తో సహా.. వివిధ డిపోలను ప్రైవేటీకరణ చేయబోతున్నారని విమర్శించారు. ఆర్టీసీని ప్రైవేటీకరణ చేసి కార్మికులను ముంచాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చూస్తోందని ధ్వజమెత్తారు. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులను స్వాగతిస్తున్నామని.. కానీ ఆర్టీసీ డ్రైవర్లతోనే ఎలక్ట్రిక్ బస్సులను నడపాలని సూచించారు. ఎలక్ట్రిక్ వాహనాలు నడపడానికి ఆర్టీసీ ఉద్యోగులకు ట్రైనింగ్ ఇవ్వాలని తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.

# జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి రేసులో లేను



**హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా కాంగ్రెస్ టికెట్ ఎవరికి ఇస్తారనే ఉత్కంఠ నడుమ బొంతు రామ్మోహన్ కీలక వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి రేసులో తాను లేనని స్పష్టం చేశారు. టికెట్ కోసం ఎవరిని అడలేదని తెలిపారు. అభ్యర్థిని హైకమాండ్ నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. అభ్యర్థి ఎవరైనా సరే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పనిచేస్తానని వెల్లడించారు.కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బొంతు రామ్మోహన్, సీఎన్ రెడ్డి, అంజన్ కుమార్ యాదవ్‌లు జూబ్లీహిల్స్ సీటు ఆశిస్తున్నారని ప్రచారం ఉంది.వీరిలో నవీన్ యాదవ్, బొంతు రామ్మోహన్, సీఎన్ రెడ్డి పేర్లను కాంగ్రెస్ అధిష్టానానికి రేవంత్ సర్కార్ సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. వీరిలో ఒకరిని త్వరలోనే ఖరారు చేసే అవకాశం ఉంది. ఈ క్రమంలో బొంతు రామ్మోహన్ తాను అభ్యర్థి రేసులో లేనని చెప్పడం గమనార్హం. ఇదిలా ఉంటే.. మరో ఆశావహ అభ్యర్థి నవీన్ యాదవ్‌పై ఇవాళ క్రిమినల్ కేసు నమోదైంది. నవీన్ యాదవ్ కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా ఈ నెల 4న యూసుఫ్‌గూడలో ఓటర్లు కార్డులను పంపిణీ చేశారు. ఈవ్యవహారాన్ని ఎలక్షన్ కమిషన్ సీరియస్ తీసుకున్నది. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్ ఎన్నికల అధికారి, యూసుఫ్‌గూడ సర్కిల్, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ రజినీకాంత్‌రెడ్డి మధురానగర్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. దీంతో నవీన్ యాదవ్‌పై బీఎన్ఎస్ 170, 171, 174తో పాటు ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద కేసులు నమోదు చేశారు.

# వైసీపీ నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి షాక్ పిటిషన్ కొట్టివేత




**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మద్యం కుంభకోణం కేసులో వైసీపీ నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసింది. ఈ మేరకు మోహిత్ రెడ్డి పిటిషన్‌పై (మంగళవారం) విచారణ జరిగింది. విచారణ చేపట్టిన న్యాయస్థానం ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించింది. సుదీర్ఘ వాదనల అనంతరం ఇవాళ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. మద్యం కుంభకోణం కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మోహిత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తుడా చైర్మన్‌గా ఉండగా మద్యం ముడుపులు తరలించేందుకు అధికార వాహనాలు వాడారనేది తనపై ఆరోపణలు ఉన్నాయి. తన ప్రతిష్ఠను దిగజార్చేందుకు కేసులో ఇరికించారని, దర్యాప్తుకు సహకరిస్తానని, కోర్టు విధించే షరతులకు కట్టుబడి ఉంటానని మోహిత్‌రెడ్డి తెలిపారు. ఈ అంశాలు పరిగణనలోకి తీసుకొని తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఇవాళ విచారణ చేపట్టి న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది.

# పార్టీ మారితే పదవికి రాజీనామా చేయాలి




**నెల్లూరు:** భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి యత్నాన్ని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఖండించారు. దాడికి ప్రయత్నం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది ఛీఫ్ జస్టిస్‌కి సంబంధించిన అంశం కాదు, సమాజానికి, వ్యవస్థకి సంబంధించిన విషయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధులు పార్టీ మారితే.. ఆ పార్టీ ద్వారా పొందిన పదవికి రాజీనామా చేయాలని వెంకయ్యనాయుడు తెలిపారు. రాజ్యాంగంలో 10వ షెడ్యూల్‌ని సవరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పార్టీ మారి మంత్రులు అవుతున్నారని ఆరోపించారు. చట్టానికి అతీతంగా ఎవరూ వ్యవహరించకూడదని సూచించారు. ప్రజలకి అందించే ఉచితాలు పరిధులు దాటుతున్నాయని వివరించారు. ప్రభుత్వాలు తాహతుకు మించి అప్పులు చేస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వాలు అప్పులు తెచ్చేటప్పుడు, ఎలా తీరుస్తారో ప్రణాళికలు అసెంబ్లీలో చర్చించాలని ఆయన కోరారు. చట్టసభల్లో కుటుంబ సభ్యులని దూషించడం సరికాదని వెంకయ్యనాయుడు హితవు పలికారు. అలాంటి వారిపై చట్టాన్ని ప్రయోగించి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ మన దేశంలోనే ఉందని గుర్తుచేశారు. మనదేశ కీర్తిని ప్రతి ఒక్కరూ చాటాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల క్రిమినల్ కేసులుపై రెండేళ్లలోపే విచారణ జరగాలని చెప్పారు. ప్రభుత్వాలు కోర్టుల సంఖ్యలు పెంచి, జడ్జీలని నియమించాలని కోరారు. రాజకీయ వారసత్వానికి తాను వ్యతిరేకమని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు.

# త్వరలోనే మూల్యం చెల్లించుకుంటారు



**అమరావతి, అక్టోబర్ 7:** టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డిపైమంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గత పాలక మండలి హయాంలో టీటీడీలో భక్తులకు కనీస సదుపాయాలు కరువయ్యాయని విమర్శించారు. దేవస్థానం అంటే రాజకీయ అడ్డా కాదని, గత పాలనలో టీటీడీని రాజకీయాలతో కలుషితం చేశారని ఆరోపించారు. అధికార మదంతో అడ్డగోలుగా నిర్ణయాలు తీసుకుని, భక్తుల విశ్వాసంతో చెలగాటమాడారని మండిపడ్డారు. స్వామి వారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు నాణ్యమైన భోజనం కూడా కష్టమయ్యే పరిస్థితిని సృష్టించిన పాపం గత పాలకులదే అంటూ దుయ్యబట్టారు. భూమన చేసిన వ్యాఖ్యలు స్వామి వారిని, భక్తులను అగౌరవపరిచేలా ఉన్నాయన్నారు. దేవుడితో చెలగాటాలు ఆడితే, ఆయన ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. పవిత్రమైన టీటీడీ ప్రతిష్టను దిగజార్చలాని, అపవిత్ర ఆలోచనతో విధిగా వ్యాఖ్యలు చేయడం తగదని హితవుపలికారు. ఇకపై ధార్మిక సంస్థల్లో రాజకీయ జోక్యాన్ని ఉపేక్షించేది లేదని.. పాత తప్పులు పునరావృతం కావని స్పష్టం చేశారు. టీటీడీకి భూమన చేసిన అన్యాయానికి త్వరలోనే మూల్యం చెల్లించుకుంటారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు.

# తిరుమలకు ఆగని థ్రెట్ మెయిల్స్ తో అలజడి



**తిరుపతి** :గత కొంత కాలంగా ఫేక్ మెయిల్స్ అలెర్ట్స్ తో వెంకన్న భక్తులు యాత్రికుల్లో ఆందోళన నెలకొంది. భయపడొద్దని ధైర్యం చెప్పే ప్రయత్నం చేస్తున్న పోలీసు యంత్రాంగం టెంపుల్ సిటీ తిరుపతిలో అలెర్ట్ గా ఉంది. అంతేకాదు ఈ వరసగా వస్తున్న మెయిల్స్ పోలీసులకు సవాలు గా మారాయి. అవును టెంపుల్ సిటీ తిరుపతికి గత ఏడాదిగా వస్తున్న బాంబు బెదిరింపు మెయిల్స్ ఆగడం లేదు. దీంతో ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో ఆందోళన నెలకొంది. గత ఏడాదిగా వరుస వస్తున్న బెదిరింపులతో పోలీసు యంత్రాంగం కూడా హడలిపోతుంది. గతేడాది అక్టోబర్ 24, 28 వరుసగా బాంబు బెదిరింపు మెయిల్స్ రాగా డిసెంబర్ 9న కపిలతీర్థం రోడ్ లోని రాజ్ పార్క్ హెూటల్ కు మెయిల్ వార్నింగ్ వచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరి లోనూ ఇస్కాన్ ఆలయానికి, పలు హెూటల్స్ కు వచ్చిన బాంబు బెదిరింపు మెయిల్స్ ఆందోళనకు గురి చేయగా సింధూర్ ఆపరేషన్ సమయంలో తిరుమలలో ఒక కుటుంబాన్ని బాంబు వేసి పేల్చి వేస్తామంటూ బెదిరింపు కాల్ వచ్చింది. ఈ మేరకు అలిపిరి పిఎస్ లో కేసు కూడా నమోదయింది. ఇక ఈ నెల 3, 6 న తిరిగి వరుసగా పాక్, ఐసిస్ ల పేరుతో బాంబు మెయిల్స్ రాగా ఆగని మెయిల్స్ తో టెంపుల్ సిటీ లో టెన్షన్ వాతావరణం ఉంది. ఎయిర్పోర్ట్ తో మొదలైన బాంబు బెదిరింపు మెయిల్స్ హెూటల్స్ కు, ఆలయాలకు వస్తుండడంతో అలజడి నెలకొంది. గతంలో ఎక్స్ అకౌంట్ నుంచి ఎయిర్పోర్ట్ కు బెదిరింపు రాగా ఆ తర్వాత పలు హెూటల్స్ బ్లాస్ట్ చేస్తామంటూ ఇమెయిల్స్ వచ్చాయి. టెంపుల్స్ కు సైతం అదే తరహా థ్రెట్ మెయిల్స్ ఇప్పటికే వచ్చాయి. దీంతో పోలీసు యంత్రాంగానికి కంటిమీద కునుకు లేకుండా పోతోంది. థ్రెట్ మెయిల్స్ సీన్ రిపీట్ అవుతుండడంతో టెంపుల్ సిటీ లో టెన్షన్ నెలకొంది. అసలు ఈ మెయిల్స్ ఎక్కడి నుంచి వస్తున్నాయి, ఏఏ అకౌంట్స్ నుంచి పోస్టు చేస్తున్నారన్న దానిపై ఆరా తీస్తున్న పోలీసులు ఐడి లేంటి, ఐపి అడ్రస్సులెక్కడ అన్న దానిపై సైబర్ టీం తెలుసుకునే ప్రయత్నం చేస్తోంది. తులసి మాల ధరిస్తున్నారా.. ఈ తప్పులు చేస్తే ముప్పే. అలర్టుగా ఉన్న పోలీసు యంత్రాంగం థ్రెట్ మెయిల్స్ తో అణువణువు తనిఖీలు నిర్వహిస్తోంది. యాత్రికులు భక్తులు రద్దీగా ఉండే ప్రాంతాల్లో బీడీ టీమ్స్ తో తనిఖీలు కొనసాగిస్తోంది. నిఘా కట్టుదిట్టం చేసింది. అయితే ఇప్పటివరకు ఎక్కడా ఒక్క క్లూ కూడా దొరకక పోయినా పోలీసు యంత్రాంగం మాత్రం అప్రమత్తంగానే ఉంటోంది. వర్చువల్ ప్రైవేట్ నెట్వర్క్ టెక్నాల జీని వినియోగించి సైబర్ క్రైమ్ కు పాల్పడుతున్న నేరగాళ్ల ను గుర్తించడం పోలీసులకు కూడా సవాలుగా మారిపోయింది. అడ్రస్ లను కనుగొనలేక పోతున్న సైబర్ ఎక్స్పర్ట్స్ శ్రమ వృధా అవుతుంది. ఫేక్ మెయిల్స్ గా తేల్చుతున్న పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ చేస్తున్న తనిఖీలతో యాత్రికులతోపాటు స్థానికుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది.

# వాల్మీకి అడుగుజాడల్లో నడవాలి



**శ్రీ సత్యసాయి :** రామాయణాన్ని లోకానికి పరిచయం చేసిన ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయమని, వారి అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం షాది మహల్ ఫంక్షన్ హాల్లో జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రామాయణ మహాకావ్యాన్ని రచించడం ద్వారా సీతా రాముల సద్గుణాలును, గొప్పదనాన్ని చెప్పడంతో పాటు ఆదర్శవంతమైన జీవితం, కుటుంబ విలువల నుంచి పాలనా సూత్రాల వరకు , సమాజ శ్రేయస్సుకు అవసరమైన ఎన్నో జీవన సూత్రాలను తెలియచేసిన వాల్మీకి మహర్షికి మనమందరం రుణపడి ఉన్నామన్నారు. రామాయణం సామాజిక నీతిని బోధిస్తుందన్నారు. అందరూ ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని దైనందిన జీవితంలో స్ఫూర్తితో జీవించాలన్నారు. అనంతరం వాల్మీకి కుల సంఘాల నాయకులు తెలిపిన సమస్యలను పరిశీలించి పరిష్కార చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో చిన్నారులు చేసిన నృత్యాలు, నాటక ప్రదర్శన లు అందరిని అలరించాయి. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఓబులపతి, వాల్మీకి సంఘ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మి నారాయణ, వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షులు సి. గంగన్న,టీడీపీ సాధికారత సంఘ అధ్యక్షులు రామాంజనేయులు, టీడీపీ నాయకులు సాకే ఆదినారాయణ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి జి. రాజేంద్ర కుమార్ రెడ్డి, సాంఘీక సంక్షేమ శాఖ డిడి, సంబధిత నాయకులు, కుల సంఘాల తదితరులు ల్గొన్నారు. కలెక్టరేట్‌లో.స్థానిక కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ వారు మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో వెంకట నారాయణ, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జగన్ ఎన్ని జన్మలెత్తినా పాపాలను కడుక్కోలేరు



**అమరావతి, అక్టోబరు7:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై తెలుగుదేశం ఎమ్మెల్యే, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీ హయాంలో జరిగిన లిక్కర్ స్కాంపై విమర్శలు చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు సోమిరెడ్డి. 'ఏంది జగనన్నా..మీ నోటి వెంట నీతిసూక్తులా' అని ఎద్దేవా చేశారు. దెయ్యాలు వేదాలు వల్లించడం.. జగన్ కల్తీ లిక్కర్ గురించి మాట్లాడటం నూటికి నూరుశాతం ఒక్కటేనని సెటైర్లు గుప్పించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా రూ.3500 కోట్ల స్కామ్‌తో ప్రజల ప్రాణాలతో ఆడుకుంది జగన్ ప్రభుత్వం కాదా అని ఫైర్ అయ్యారు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి. నాణ్యత లేని జే బ్రాండ్స్‌తో..జగన్ తన అక్రమార్జన కోసం నాణ్యత లేని జే బ్రాండ్స్‌తో వేలమంది ప్రాణాలు తీసి.. లక్షల మంది ఆరోగ్యాన్ని దెబ్బతీశారని ధ్వజమెత్తారు. అనేక కుటుంబాలను ఆర్థికంగా నాశనం చేసిన జగన్ రెడ్డీ.. ఇప్పుడు సమర్థించుకుంటారు..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రపంచ రాజకీయ చరిత్రలో జగన్‌లా ఇంత పచ్చి అబద్ధాలు ఆడే మరొక నాయకుడు ఉండరు... ఉండబోరని ఎద్దేవా చేశారు. క్యాష్ అండ్ క్యారీ సిస్టమ్‌తో జే బ్రాండ్ మద్యమే తాగాలనే కండీషన్ పెట్టి, వేల మంది ప్రాణాలను తీశారని మండిపడ్డారు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి. జే బ్రాండ్ మద్యం తాగిన లక్షలాది మంది నరకయాతన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం తయారీ, సరఫరా, అమ్మకం ఇలా అన్ని విభాగాలను జగన్ తన చేతిలో పెట్టుకున్నారని ఆక్షేపించారు. వేలకోట్ల నోట్లకట్టలతో డంపు పెట్టుకున్న జగన్.. ఇప్పుడు మాట్లాడుతుంటే విడ్డూరంగా

# పేద విద్యార్థికి వైద్య విద్య.. ఇదే కూటమి సర్కార్ లక్ష్యం




**విశాఖపట్నం, అక్టోబర్ 7:** గత ప్రభుత్వం అసమర్ధ పాలన వలన మెడికల్ కళాశాలలకు ఈ దుస్థితి వచ్చిందని మంత్రి సత్య కుమార్ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పార్వతీపురం జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేస్తే గత ఐదేళ్లలో కనీసం భూసేకరణ కూడా చేయలేదని. హాస్పిటల్ నిర్మాణానికి టెండర్లు కూడా పిలవలేదని మండిపడ్డారు. గత ఐదేళ్లలో మెడికల్ కళాశాలల నిర్మాణం కోసం పట్టించుకోలేని వైసీపీ నాయకులు ఇప్పుడు విమర్శలు చేస్తున్నారన్నారు. పాడేరులో మెడికల్ కళాశాలను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా చేయకపోతే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తి చేశామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం పూర్తిగా గిరిజన ప్రాంతాలను విస్మరించిందని.. గిరిజన విశ్వవిద్యాలయం రాకుండా అడ్డుకున్నాని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం పాపాలు తమకు శాపాలుగా మారాయని వ్యాఖ్యలు చేశారు. పీపీపీకి ప్రైవేటైజేషన్‌కు తేడా తెలియకుండా వైసీపీ నాయకులు మాట్లాడుతున్నారని మంత్రి దుయ్యబట్టారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో వైద్య కళాశాలలో నిర్మించి ఉంటే ఇప్పుడు ఈ సమస్య ఉండేది కాదన్నారు. వైద్య విద్యను రాష్ట్రంలో పేద విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతోందని స్పష్టం చేశారు. గతంలో తాము చేయలేని పనిని కూటమి ప్రభుత్వం చేసి చూపిస్తుందని వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారుని వ్యాఖ్యలు చేశారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అనారోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చితే.. తాము ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా నిర్మాణం చేస్తున్నామని వెల్లడించారు. పాఠశాలలలో కనీసం నిర్వహణ పనులు గత ప్రభుత్వం చేయలేదన్నారు'జగన్మోహన్ రెడ్డి నర్సీపట్నం మెడికల్ కళాశాలల పరిశీలనకు వస్తే అదే సమయంలో నేను వస్తాను. మెడికల్ కళాశాలల పరిస్థితిని జగన్‌మోహన్ రెడ్డికి వివరిస్తాను. జగన్ ప్యాలెస్ పూర్తిస్థాయిలో నిర్మాణం చేసే వరకు లోపలికి వెళ్లారా. నర్సీపట్నం మెడికల్ కళాశాల పరిశీలనకు వస్తున్న జగన్ పార్వతీపురంలో నిర్మించిన మెడికల్ కళాశాల చూసి అక్కడ పరిస్థితిని వివరించాలి. జగన్ ప్రజలను అసత్యాలు చెప్పి నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్ర ప్రజలు జగన్ కు గుణపాఠం చెప్పిన మార్పు రావడం లేదు. జగన్ ఆత్మ పరిశీలన చేసుకొని బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నాయకునిలా వ్యవహరించాలి. జగన్‌కు అసెంబ్లీకి రమ్మని సవాల్ విసిరినా రాలేదు' అంటూ మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలు చేశారు.

# బొత్స ఫ్యామిలీకి తప్పిన ప్రమాదం సిరిమానోత్సవంలో కూలిన వేదిక




**విజయనగరం:** వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కుటుంబానికి పెను ప్రమాదం తప్పింది. విజయనగరంలో సిరిమానోత్సవం చూస్తుండగా వేదిక కూలింది. ఆ సమయంలో బొత్స కుటుంబం వేదికపైనే ఉంది. అయితే ఎటువంటి గాయాలు కాకుండా బొత్స ఫ్యామిలీ సురక్షితంగా బయటపడింది. కానీ ఈ ప్రమాదంలో ఎస్పై, మరో చిన్నారి గాయపడ్డారు. ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు విజయనగరం పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ప్రధాన ఘట్టమైన సిరిమానోత్సవం కన్నులపండువగా సాగుతోంది. పూజారి వెంకటరావు సిరిమాను అధిరోహించారు. చదరగుడి నుంచి విజయనగరం కోట వరకు సిరిమానును ఉరేగిస్తున్నారు. ఈ సిరిమానోత్సవం తిలకించేందుకు సతీసమేతంగా బొత్స సత్యనారాయణ వచ్చారు. ఈ క్రమంలోనే వేదికపై కూర్చుని ఉండగా అది కూలింది.

# జగన్‌కు హెలికాప్టర్ ఓకే రోడ్ షోకు నో పర్మిషన్



**అనకాపల్లి జిల్లా, అక్టోబర్ 7:** విశాఖపట్నం నుంచి మాకవరపాలెం వరకూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రోడ్ షోకు అనుమతి ఇవ్వలేమని అనకాపల్లి జిల్లా ఎస్పీ తూహిన్ సిన్హా ప్రకటించారు. మాకవరపాలెంలో నిర్మితమవుతున్న మెడికల్ కాలేజీ పనులను పరిశీలించడానికి ఈ నెల 9వ తేదీన జగన్ రానున్నారు. ఈ నేపథ్యంలో (మంగళవారం) అనకాపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయంలో అనకాపల్లి జిల్లా ఎస్పీ మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. మాజీ సీఎం జగన్ విశాఖ నుంచి మాకవరపాలెం వరకు 63 కిలో మీటర్ల జాతీయ రహదారిపై కాన్వాయ్‌తో రావడానికి వైసీపీ శ్రేణులు అనుమతులు కోరినట్లు తెలిపారు. విశాఖ నుంచి మాకవరపాలెం వరకు హెలికాప్టర్‌పై మాజీ సీఎం జగన్ వచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించినట్లు చెప్పారు. జాతీయ రహదారి రోడ్డు మార్గంలో కూడళ్ల వద్ద జన సమీకరణ చేసే ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. అంతేకాదు ఇటీవల మాజీ మంత్రి విడదల రజినీపై నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం డిజిటల్ బుక్ యాప్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించారు. 2022లో పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని నవతరం పార్టీ కార్యాలయం, తన ఇల్లు, కారుపై విడదల రజిని దాడి చేయించారని.. ఆమెపై తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డికి డిజిటల్ బుక్ యాప్ ద్వారా ఫిర్యాదు చేశానని రావు సుబ్రహ్మణ్యం మీడియాకు తెలిపారు. అనంతరం డిజిటల్ బుక్ యాప్ ద్వారా వచ్చిన టికెట్‌ను చూపించారు. తనకు న్యాయం జరిగితే జగన్ చెప్పినట్లు వైసీపీ కార్యకర్తలకూ న్యాయం జరుగుతుందనే నమ్మకం కలుగుతుందన్నారు. రావు సుబ్రహ్మణ్యం ఫిర్యాదు చేయడానికి ముందే డిజిటల్ బుక్ యాప్‌ను చిలకలూరిపేటలో మాజీ మంత్రి విడదల రజిని తన ఇంటి వద్ద పార్టీ నాయకులు, శ్రేణులతో కలిసి ఆవిష్కరించడం గమనార్హం. మొత్తం మీద వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్‌లో ఇలా వరుసగా ఆ పార్టీ నేతలపైనే ఫిర్యాదులు చేయడం ఆసక్తికరంగా మారింది. ఈ ఫిర్యాదుల వ్యవహారంపై వైఎస్సార్‌సీపీ అధిష్టానం స్పందించాల్సి ఉంది. మడకశిర వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామిపై వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్‌లో ఫిర్యాదులు నమోదయ్యాయి. మున్సిపల్ చైర్మన్ పదవి ఇప్పిస్తానని రూ. 25 లక్షలు తీసుకున్నారని కౌన్సిలర్ ప్రియాంక, ఆమె తండ్రి విక్రమ్ ఫిర్యాదు చేశారు. అలాగే, అంగన్ వాడీ హెల్పర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 75 వేలు తీసుకున్నారని దోక్కలపల్లి గ్రామానికి చెందిన రామరాజు కూడా ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఈ ఫిర్యాదు కూడా వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్‌లో నమోదైంది. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి వ్యవహారం పార్టీలో తీవ్ర చర్చకు దారితీసింది. ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రజలకు అసౌకర్యం కలగకుండా రోడ్డు మార్గంలో మాజీ సీఎం జగన్ పర్యటించేందుకు అనుమతులు నిరాకరిస్తు న్నట్లు చెప్పారు. మాకవరపాలెం మెడికల్ కళాశాల వద్ద హెలిపాడ్ ఏర్పాటు చేసి జగన్ మోహన్ రెడ్డి హెలికాప్టర్‌లో వచ్చేలా అనుమతి ఇచ్చామన్నారు. తమిళనాడులో ఇటీవల విజయ్ నిర్వహించిన రోడ్ షోలో 41 మంది ప్రాణాలు కోల్పోగా, వందమందికి పైగా గాయపడ్డారని గుర్తుచేశారు. ఇలాంటి దురదృష్టకరమైన సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇందులో భాగంగానే మాజీ సీఎం జగన్ 63 కిలోమీటర్ల మేర కాన్వాయ్‌తో ప్రయాణించేందుకు అనుమతిని నిరాకరించామని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్పష్టం చేశారు.

# అన్నాడీఎంకే వైపు విజయ్ చూపు పొత్తుపై రహస్య మంతనాలు



**చెన్నై:** కరూర్ తొక్కిసలాట ఘటనతో తీవ్రంగా నష్టపోయిన 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే).. నష్టనివారణ చర్యలకు దిగిందా?. అధికార డీఎంకేను ఒంటరిగా అడ్డుకోవడం కష్ట సాధ్యంగా మారడంతో.. అన్నాడీఎంకేతో చేతులు కలిపేందుకు సిద్ధమైందా? ఆ పార్టీ అధినేత విజయ్ ఆదేశాల మేరకు క్రియాశీలక నేతలు.. అన్నాడీఎంకేతో మంతనాలు సాగిస్తున్నారా?.. అవుననే అంటున్నాయి అత్యంత విశ్వసనీయ రాజకీయ వర్గాలు. రెండేళ్ల క్రితం పార్టీని ప్రారంభించిన విజయ్. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు కదనోత్సాహంతో సిద్ధమవుతున్న విషయం తెలిసిందే.ఇందులో భాగంగా వారానికి రెండురోజులు జిల్లా కేంద్రాల్లో బస్సు ప్రచారం చేపడుతున్నారు. అధికార డీఎంకేపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల కరూర్ ప్రచారం సందర్భంగా తొక్కిసలాట జరిగి.. 41 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో పోలీసుల అరెస్టుకు భయపడి పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ సహా ప్రముఖులంతా అజ్ఞాతంలోకి వెళ్లిపోవటంతో ఆ పార్టీ డైలమాలో పడిపోయింది. కరూర్ దుర్ఘటనపై డీఎంకే తీవ్రంగా స్పందించకపోయినా ఆ ఘటనకు బాధ్యులు ఆ పార్టీయేనన్నట్లుగా విజయ్ వేలెత్తి చూపుతున్నారు. ఘటనపై నిరాధార పరస్పర ఆరోపణలకు దిగవద్దని, సంయమనం పాటించాలంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ చేసిన ప్రకటన్ని సైతం విజయ్ పట్టించుకున్నట్లుగా కనిపించడం లేదు. అయితే ప్రభుత్వ యంత్రాంగం మాత్రం టీవీకేదే తప్పు అన్నట్లుగా చర్యలకు దిగింది. ఇదే సమయంలో బీజేపీ, అన్నాడీఎంకేలు విజయ్ పార్టీని సమర్థిస్తూ ప్రకటనలు చేస్తున్నాయి. అన్నాడీఎంకే అధినేత, మాజీ ఎడప్పాడి పళనిస్వామి అయితే ఈ దుర్ఘటనతో విజయ్‌కి ఎలాంటి సంబంధం లేదన్న ధోరణితో ప్రకటనలు గుప్పిస్తున్నారు అంతేకాకుండా విజయ్‌పై ఎలాంటి విమర్శలు చేయవద్దంటూ రెండు పార్టీల నేతలకు మౌఖిక ఆదేశాలు కూడా వెళ్లినట్లు తెలిసింది. ఇక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, మాజీ అధ్యక్షుడు అన్నామలై, ఆ పార్టీ సీనియర్ నేత హెచ్. రాజా విజయ్‌కి మద్దతుగానే వ్యాఖ్యలు చేస్తున్నారు. కరూర్ దుర్ఘటనకు రోడ్‌షోలో తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టని డీఎంకే ప్రభుత్వమే ప్రధాన కారణమని ఆరోపిస్తున్నారు.పోస్టర్ల కలకలం.అన్నాడీ ఎంకేతో పొత్తు పెట్టుకోవాలా? వద్దా? అని టీవీకే అధినేత విజయ్ మల్లగుల్లాలు పడుతుండగానే పార్టీ శ్రేణులు ఆయన అనుమతి తీసుకోకుండా మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళని స్వామి(ఈపీఎస)ని స్వాగతిసు _న్నట్లు రాష్ట్రవ్యాప్తంగా పోస్టర్లు అంటిస్తున్నారు. ఇకపై ఎడప్పాడి పాల్గొనే సభలు ఎక్కడ జరిగినా విజయ్, ఈపీఎస్ ఫొటోలతో స్వాగత బ్యానర్లు ఏర్పాటు చేస్తా మంటూ సినీ అభిమానాలు, పార్టీ కార్యకర్తలు చెబుతున్నారు.ఈ పరిస్థితులలో విజయ్‌ని ఎన్డీయేలో చేర్చుకోవాలని అన్నాడీఎంకే నేతలు, బీజేపీ నేతలు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఎన్డీయేకి, తనకు రాజకీయ ప్రత్యర్థి డీఎంకే కనుక ఉమ్మడి శత్రువైన స్టాలిన్ ఢీకొనడానికి మెగా కూటమిలో చేరటమే మంచిదని విజయ్ భావిస్తున్నట్లు తెలిసింది. ఆ మేరకు టీవీకే క్రియాశీలక నేతలు అన్నాడీఎంకే నేతలతో చర్చిస్తున్నట్లు తెలిసింది.

# కరూర్ తొక్కిసలాట ఘటనపై సుప్రీంకోర్టులో పిటిషన్



**ఢిల్లీ:** టీవీకే చీఫ్, నటుడు విజయ్ కరూర్ ర్యాలీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట అంశం సుప్రీంకోర్టుకు చేరింది. సీబీఐ దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేయాలని మద్రాస్ హైకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు అయ్యి ంది. ఈ పిటిషన్ విచారించేం దుకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం అంగీకరించింది. ఈ మేరకు అక్టోబర్ 10వ తేదీన సుప్రీంకోర్టులో కేసు విచారణ జరగనున్నట్లు సమాచారం.టీవీకే అధ్యక్షుడు విజయ్ తమిళనాడులోని కరూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. సభలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు విజయ్ రూ.20 లక్షల చొప్పున పరిహారం అందించారు. అయితే విజయ్ ర్యాలీలో తొక్కిసలాటపై సీబీఐ దర్యాప్తు కోరుతూ భారతీయ జనతా పార్టీ నేత ఉమా ఆనందన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఉమా ఆనందన్ వేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. ఈ నేపథ్యంలో హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ.. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు అయ్యింది.

# కేంద్రమంత్రి సంచలన కామెంట్స్ అందుకే డీఎంకేకు గవర్నర్ శత్రువు

- వారి అవినీతిని అడ్డుకుంటున్నారని ఆగ్రహం
- కేంద్రమంత్రి మురుగన్



**చెన్నై:** ప్రజాధనం దోచుకుంటున్న డీఎంకేను అడ్డుకుంటున్నారన్న ఆగ్రహంతోనే రాష్ట్ర గవర్నర్‌ను ఆ పార్టీ శత్రువుగా పరిగణిస్తోందని కేంద్రమంత్రి ఎల్.మురుగన్ పేర్కొన్నారు. కోవై మేట్టుపాళయంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ. 2014వ సంవత్సరం కేంద్రంలో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రాష్ట్రాల అభివృద్ధిపై ప్రధాని నరేంద్ర మోదీ దృష్టి సారించి నిధులు, పథకాల్లో సమన్యాయం పాటిస్తున్నారని తెలిపారు.రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక జిల్లాగా గుర్తింపు పొందిన కోవైలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించే దిశగా బైపాస్ రోడ్డు, మేట్టుపాళయం-అవినాశి నాలుగు రోడ్ల విస్తరణ పనులను త్వరలోనే ప్రారంభించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నాలుగున్నరేళ్లకు పైగా అధికారంలో ఉన్న డీఎంకే ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని పక్కనబెట్టి భారీస్థాయిలో అవినీతికి పాల్పడుతోందని ఆరోపించారు.ఈ అవినీతిని ఎప్పటికప్పుడు అడ్డుకుంటూ ప్రభుత్వాన్ని నిలదీస్తున్న గవర్నర్‌ను అధికార పార్టీ నేతలు బద్ధశత్రువుగా భావిస్తున్నార ని తెలిపారు. రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో పార్టీ బూత్ కమిటీలను ఏర్పాటు చేసే పనులు జరుగుతున్నాయని, అన్నాడీఎంకే కూటమిలో ఉన్న మిత్రపక్షాలను కూడగట్టుకుని రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవడమే తమ ఏకైక లక్ష్యమని కేంద్రమంత్రి అన్నారు.

# ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల సేవ అనుభూతులు పంచుకున్న ప్రధాని మోదీ





**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ తన రాజకీయ జీవితంలో కీలక మైలురాయి అందుకున్నారు. ప్రభుత్వాధినేతగా ఆయన 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఓ ప్రభుత్వానికి అధినేత హోదాలో ఆయన 25 ఏళ్లుగా సేవలు అందిస్తున్నారు. అక్టోబర్ 7, 2025 నాటికి తన పరిపాలన 25 ఏళ్లకు చేరుకున్నట్లు ప్రధాని మోదీ తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్నారు. ఇదే రోజున 2001లో గుజరాత్ సీఎంగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. దేశ ప్రజల జీవితాలను బలోపేతం చేసేందుకు, దేశ ఉజ్వల ప్రగతి కోసం ఆ నాటి నుంచి శ్రమిస్తున్నట్లు చెప్పారు.చాలా విపత్కర పరిస్థితుల్లో ఉన్న గుజరాత్‌కు తనను సీఎంగా చేశారని, ఆ బాధ్యతలను తనకు పార్టీ అప్పగించినట్లు గుర్తు చేశారు. భారీ భూకంపం, సూపర్ సైక్లోన్, వరుస కరవులతో సతమతం అవుతున్న గుజరాత్‌ను తన చేతుల్లో పెట్టారన్నారు. ఇక 2014 లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రధానిగా దేశానికి సేవ చేస్తున్నట్లు మోదీ తన ఎక్స్ అకౌంట్‌లో తెలిపారు. తన ట్వీట్స్‌లో వివిధ అనుభవాలను గుర్తు చేశారు.

# ఆయుధ కొనుగోళ్లలో స్వావలంబనకు పెద్దపీట



**న్యూఢిల్లీ:**జాతీయ భద్రత సవాళ్లను ఎదుర్కొనేందుకు ఆయుధ కొనుగోళ్లలో స్వావలంబనకు పెద్దపీట వేస్తున్నట్లు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశీయ సంస్థల నుంచి రూ.1.20లక్షల కోట్లు విలువ చేసే ఆయుధాలు కొను గోలు చేసినట్లు చెప్పారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధిం చడానికి అవసరమైన మూడు ప్రధాన లక్ష్యాల ప్రాధాన్యత గురిం చి వివరించారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమ ంలో పాల్గొన్న రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ కీలకమైన రక్షణ సామర్థ్యాల్లో స్వావలంబన సాధించాలని పేర్కొన్నారు. యుద్ధరంగంలో మారుతున్న పరిస్థితుల పట్ల ప్రభుత్వం పూర్తి అవగాహనతో ఉందన్నారు.'భారత్ ఇప్పటికే ఆధునిక సాంకేతిక రంగాలలో ముందంజలో ఉంది. కానీ దేశాన్ని అగ్రగామిగా మార్చడానికి కొత్త, ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానాల్లో మరింత అభివృద్ధి సాధించాలి. 2047 నాటికి వికసిత్ భారత్ మారాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నప్పుడు మూడు ప్రధాన అంశాల ను గుర్తుంచుకోవాలి. మొదటిగా కీలక రక్షణ సామర్థ్యాలలో ఉన్నత స్థాయి స్వావలంబన సాధించాలి. రెండవది, రక్షణ రంగంలో ప్రపంచ ఎగుమతిదారుగా మారాలి. మూడవది, ఆధునిక సాంకేతిక రంగాలలో భారత్‌ను ముందుకు తీసుకెళ్లేం దుకు, కొత్త, ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానాల్లో పురోగతి సాధించా లి. ఈ మూడు లక్ష్యాలను చేరుకోగలిగితే, భారత్‌ను 2047 నాటికి వికసిత దేశంగా మాత్రమే కాకుండా, రక్షణ ఆవిష్కరణలో ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా మార్చవచ్చు' అని రాజ్?నాథ్ సింగ్ అన్నారు.సాంకేతిక ఆధారంగానే ఆధునిక యుద్ధాలు : రాజ్‌నాథ్ సింగ్ఆధునిక యుద్ధాలు సాంకేతికత ఆధారంగా మారిపోయాయని మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్ సందర్భంగా ఈ మార్పును స్పష్టంగా చూశామని చెప్పారు. డ్రోన్లు, యాంటీ-డ్రోన్ వ్యవస్థలు, వైమానిక రక్షణ వ్యవస్థలు వంటి నాన్-కాంటాక్ట్ వార్‌ఫేర్ ప్రాముఖ్యత గణనీయంగా పెరిగిందని తెలిపారు. ఫలితంగా సవాళ్లు, బాధ్యతలు రెండు కూడా పెరిగాయని చెప్పారు. మనం ప్రస్తుత అత్యాధునిక సాంకేతికతలు ఏఐ, క్వాంటం టెక్నాలజీ వంటి వాటిని నేర్చుకోవాలని చెప్పారు. వాటినే కాకుండా ప్రపంచంలో ఇంకా ఆవిష్కరించని భవిష్యత్ సాంకేతికతలపైనా కూడా దృష్టి పెట్టాలని రాజనాథ్ సింగ్ పేర్కొన్నారు.2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశీయ సంస్థల నుంచి రూ.1.20లక్షల కోట్లు విలువ చేసే ఆయుధాలు కొనుగోలు చేసినట్లు రాజ్?నాథ్ సింగ్ పేర్కొన్నారు. '2021-22లో దేశీయంగా ఆయుధాల కొనుగోళ్లు దాదాపు రూ.74వేల కోట్లు ఉండేవి. కానీ 2024-25లో దేశీయంగా ఆయుధాల కొనుగోళ్లు రూ.1.20లక్షల కోట్లకు చేరాయి. ఈ మార్పు కేవలం డేటా మాత్రమే కాదు ప్రభుత్వ ఆలోచన విధానం కూడా. ఏటా రక్షణ శాఖ చేసే ఆయుధ కొనుగోళ్లలో 25శాతం సూక్ష్మ, చిన్న సంస్థల నుంచి సేకరించాలని విధానపరమైన నిర్ణయం తీసుకున్నాం. ప్రస్తుతం 350కిపైగా రక్షణ పరికరాలను సూక్ష్మ, చిన్న సంస్థల నుంచే కొనుగోలు చేస్తున్నాం. విధానపరమైన సంస్కరణల ద్వారా రక్షణ శాఖ ఆయుధ సరఫరా చైన్‌లో అన్నిసంస్థలను భాగస్వాములను చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం'రాజ్‌నాథ్‌సింగ్ వివరించారు.

# సవీందర్‌రెడ్డిపై సీబీఐ చర్యలు తీసుకోవద్దు సుప్రీం కీలక ఆదేశాలు






**ఢిల్లీ, అక్టోబరు7:** సోషల్ మీడియా యాక్టివిస్టు సవీందర్‌రెడ్డి అరెస్టు చేసిన వ్యవహారంలో.. సీబీఐ తదుపరి కార్యాచరణ చేపట్టవద్దని సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సవీందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడంపై దాఖలైన హెబీయస్ కార్పస్‌పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు (మంగళవారం) విచారణ జరిపింది. ఏపీ హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టులో వ్యక్తిగత హోదాలో సవాలు చేశారు దర్యాప్తు అధికారి గన్నవరపు శ్రీనివాసరావు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ సతీష్ చంద్రశర్మ విచారణ చేపట్టారు.సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టినందుకు అక్రమంగా అరెస్టు చేశారని హైకోర్టులో సవీందర్‌రెడ్డి భార్య లక్ష్మీప్రసన్న పిటిషన్ దాఖలు చేశారు. సవీందర్‌రెడ్డిని గంజాయి కేసులో అరెస్టు చేశారని సుప్రీంకో ర్టుకి ఏపీ ప్రభుత్వ దర్యాప్తు అధికారి తరపు న్యాయవాదులు నివేదించారు. ఒక రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడని అరెస్టు చేసి... తర్వాత గంజాయి కేసులో ఇరికించారని సవీందర్‌రెడ్డి తరపు న్యాయవాది న్యాయస్థానానికి తెలిపారు. అదే విషయాన్ని హైకోర్టు పరిశీలించిన తర్వాతే సీబీఐ విచారణకు ఆదేశించిందని న్యాయవాది పేర్కొన్నారు. దర్యాప్తు అధికారి వ్యక్తిగత హోదాలో పిటిషన్ దాఖలు చేశారని, ఇది నిబంధనలకు విరుద్ధమని సవీందర్‌రెడ్డి న్యాయవాది వివరించారు.గంజాయి కేసులో అరెస్టు చేస్తే... దానికి రాజకీయ కారణాలు అన్వయిస్తున్నారని ఏపీ ప్రభుత్వ తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా న్యాయస్థానానికి తెలిపారు. ఇరువురి వాదనలను జస్టిస్ ఎంఎం సుందరేష్ ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. అనంతరం ఈ కేసుపై మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేయడంతోపాటు... సీబీఐ తదుపరి కార్యచరణ చేపట్టవద్దని ఆదేశించింది ధర్మాసనం. ప్రతివాదులుగా ఏపీ ప్రభుత్వం, డీజీపీ, సీబీఐ, రిలయన్స్ జియో సంస్థతో పాటు... మొత్తం 11 మందిని ఈ కేసులో దర్యాప్తు అధికారి చేర్చారు. ఈ కేసులో పిటిషన్ దాఖలు చేసేందుకు ఏపీ ప్రభుత్వానికి అనుమతి ఇచ్చింది ధర్మాసనం. ఈ పిటిషన్‌పై త్వరలోనే తదుపరి విచారణ చేపడతామని సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

# డీబీటీ నగదు బదిలీ ద్వారా ప్రభుత్వానికి రూ. 4.31 లక్షల కోట్లు ఆదా




**ముంబై, అక్టోబర్ 7:** వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నగదు మొత్తాల్ని ఆయా లబ్దిదారులకు నేరుగా వాళ్ల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేస్తున్న విషయం విదితమే. ఇలా చేయడం వల్ల ప్రభుత్వానికి అక్షరాలా నాలుగు లక్షల 31 వేల కోట్ల రూపాయలు ఆదా అయిందని మీకు తెలుసా. ఇది నిజం. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ముంబైలో జరుగుతున్న గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్‌లో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు.ఈ కార్యక్రమం పాల్గొన్న కేంద్ర మంత్రి ఈరోజు విదేశీ కరెన్సీ సెటిల్‌మెంట్ సిస్టమ్‌ను కూడా ప్రారంభించారు. ఈ ఆధునిక వ్యవస్థ విదేశీ కరెన్సీ లావాదేవీలను రియల్-టైమ్(తక్షణమే) ప్రాతిపదికన పూర్తి చేస్తుందని ఆమె చెప్పారు. ప్రస్తుతం, ముంబైలో విదేశీ కరెన్సీని సెటిల్ చేయడానికి 36 నుండి 54 గంటలు పడుతుందని.. ఇవాళ ప్రారంభించిన గిఫ్ట్ సెటిల్ మెంట్ వ్యవస్థతో ఈ సమయం చాలా ఆదా అవుతుందని కేంద్రమంత్రి తెలిపారు. ఫలితంగా భారత్ ఇప్పుడు, హాంకాంగ్, టోక్యో, మనీలా సరసన చేరిందని మంత్రి తెలిపారు.దేశంలో బ్యాంకింగ్, ఫైనాన్స్, ఫిన్‌టెక్, ఆధార్, , డిజిలాకర్ వ్యవస్థల్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి ఎలా ముందుకెళ్తున్నామన్న విషయాన్ని కూడా మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. దేశంలోని అన్ని వ్యవస్థలు టెక్నాలజీ వారధిగా ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. గోప్యతను దినదినాభివృద్ధి చెందాలని ఆమె సూచించారు. తద్వారా దేశం మరింత త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని నిర్మలా సీతారామన్ అన్నారు.ఇప్పటి వరకూ భారత్‌లో ఉన్న బ్యాంకులు లేదా కంపెనీలు అమెరికా డాలర్లు, యూరోలు, యెన్ వంటి విదేశీ కరెన్సీల్లో లావాదేవీలు చేయాలంటే, అవి ఇప్పటివరకు హాంకాంగ్, టోక్యో లేదా లండన్ బ్యాంకుల ద్వారా సెటిల్ చేసేవి. ఈ ప్రక్రియకు 36 నుండి 54 గంటల సమయం పట్టేది. కానీ ఇప్పుడు, ద్వారా భారత్‌లోనే ఈ లావాదేవీలను రియల్ టైమ్‌లో (తక్షణమే) పూర్తి చేయొచ్చు.

# బిహార్ సార్ పై సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు



**బిహార్ :**బిహార్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా తొలగించిన 3.66 లక్షల ఓట్ల వివరాలను వెల్లడించాలని ఈసీని సుప్రీంకోర్టు ఆదేశించింది. అక్టోబర్? 9 నాటికి పూర్తి వివరాలను కోర్టుకు సమర్పించాలని ఎన్నికల సంఘానికి స్పష్టం చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమల్యా బాగ్చితో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. దీనిపై స్పందించిన ఈసీ, భాగంగా విడుదల చేసిన తుది జాబితాలో చాలా మంది కొత్త ఓటర్లు ఉన్నారని సుప్రీంకోర్టుకు చెప్పింది. ఓటరు జాబితా నుంచి తొలగించిన వారి నుంచి ఇప్పటి వరకు ఫిర్యాదు, అప్పీల్ రాలేదని కోర్టుకు తెలిపింది."కోర్టు ఆదేశాలు ఎన్నికల ప్రక్రియకు మరింత పారదర్శకతను కల్పిస్తాయి. ముసాయిదాలో 65 లక్షల ఓట్లను తొలగించినట్లుగా కనిపిస్తోంది. ఎవరు చనిపోయినా, వలస వెళ్లినా తొలగించండి. దానికి ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ ఎవరినైనా ఓటరు?గా తొలగిస్తుంటే అందుకు సంబంధించిన రూల్ 21 ప్రకారం అనుసరించండి. ఎవరినైనా తొలగిస్తే వారి వివరాలను ఎన్నికల కార్యాలయాల్లో పెట్టాలని కూడా చెప్పాం. తాజాగా విడుదల చేసిన తుది జాబితాతో ముసాయిదాను పోల్చి చూస్తే ఓటర్ల సంఖ్యలో తేడాలు ఉన్నాయి. ఈ గందరగోళాన్ని నివారించడానికి ఈ వివరాలను బహిర్గతం చేయండి."సుప్రీం కోర్టు3.66 లక్షల మంది పేర్లను తొలగించామన్న ఈసీఅంతకుముందు కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ 3.66 లక్షల మంది పేర్లను తొలగించామని తెలిపారు.

# ఉపాధి హామీ పథకం నిధులు దుర్వినియోగం



**ఢిల్లీ, అక్టోబరు7:** గతంలో ఉపాధి హామీ పథకం నిధులు దుర్వినియోగం అయ్యాయని.. ఇప్పుడు కూడా దుర్వినియోగం అవుతున్నాయని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించడమే కాదని.. రాష్ట్ర రైతాంగానికి మద్దతుగా తెలంగాణ ప్రభుత్వం నిలవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం తమ బాధ్యత నుంచి ఎందుకు తప్పుకుంటుందని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి ఎంత పత్తి ఉత్పత్తి అయితే అంత కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రైతులకు స్మార్ట్ ఫోన్స్ లేకుండానే నిధులు వెళ్తున్నాయా అని ప్రశ్నించారు గిరిరాజ్ సింగ్.తెలంగాణ నుంచి రూ. 65 వేల కోట్ల పత్తి కొనుగోళ్లుఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013 నుంచి 2014 వరకు రూ.12, 500 కోట్ల పత్తి కొనుగోళ్లు చేస్తే.. ప్రస్తుతం రూ.73,000 కోట్ల పత్తి కొనుగోళ్లు జరిగాయని వెల్లడించారు. రూ. 65 వేల కోట్ల పత్తి కొనుగోళ్లు కేవలం తెలంగాణ నుంచే జరిగాయని వెల్లడించారు. ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అన్నదాతల ఆదాయం రెట్టింపు చేసేందుకు చర్యలు చేపట్టామని ఉద్ఘాటించారు. 2014లో క్వింటా పత్తి ధర రూ.3,700లు ఉంటే.. ఇప్పుడు క్వింటా రూ.7,710ల ధర ఉందని నొక్కిచెప్పారు. మరో గ్రేడ్ రకం గతంలో క్వింటా రూ. 4 వేలు ఉంటే.. ప్రస్తుతం క్వింటా రూ. 8,110లుగా ఉందని వివరించారు. ఇవాళ(మంగళవారం) కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌తో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఢిల్లీలో సమావేశం అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు గిరిరాజ్ సింగ్ తెలంగాణలో 20 లక్షల మంది పత్తి రైతులు ,18 లక్షల హెక్టార్లలో పత్తి పంట పండిస్తున్నారని వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పత్తి రైతులకు సహకారం ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. పత్తి రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ఒక అప్లికేషన్ ప్రారంభించిదని... రైతులు అందులో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తనను కోరారని చెప్పుకొచ్చారు. గతంలో పత్తిని ఎంత సేకరించామో..పత్తిని సేకరిస్తామని స్పష్టం చేశారు.

# న్యాయమూర్తులపై పని ఒత్తిడి !

మనదేశ జనాభాకు తగ్గట్లుగా హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో న్యాయమూర్తుల సంఖ్యను పెంచాల్సిన తక్షణ అసవరం ఉంది. ఇప్పటికే కేసుల సంఖ్యపెరుగుతోంది. ఒక్కో కేసుకు దశాబ్దాల సమయం పడుతోంది. న్యాయమూర్తులపై ఒత్తిడి పెరుగుతోంది. రోజువారీ కేసులకే సమయం సరిపోవడం లేదు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న మనదేశంలో సుప్రీంకోర్టుకు 34 మంది న్యాయమూర్తులు సరిపోతారా.. అనేది కీలక ప్రశ్న. ఇక హైకోర్టుల్లో 63 లక్షలకుపైగా, దిగువ కోర్టుల్లో దాదాపు ఐదు కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్ కేసులు కొండలా పేరుకుపోవడం ఆందోళనకరం. అత్యున్నత న్యాయస్థానం చరిత్రలోనే ఎన్నడూలేనంత అత్యధికంగా 88,417 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. న్యాయం ఆలస్యం కావడమంటే న్యాయం జరగకపోవడమే అనేది ప్రతి ఒక్కరూ గ్రహించాలి. ఎందుకంటే అండర్ ట్రయల్ ఖైదీలు కేసులు తెమలక ఏళ్లుగా జైళ్లల్లో మగ్గుతున్నారు. న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కినా ఏళ్లతరబడి కేసులు తెమలడం లేదు. రాజకీయ కేసులు తప్ప క్రిమినల్ తదితర కేసులు తేల్చడం లేదు. ఈ క్రమంలో న్యాయమూర్తుల సంఖ్యను పెంచాలి. సుప్రీం కోర్టు బెంచ్‌లను పెంచాల్సిన అవసరాన్ని గుర్తించాలి.కోర్టుల్లో తగినంతమంది న్యాయమూర్తులను, సిబ్బందిని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. లోక్ అదాలత్‌లు లాంటివి నిర్వహించి ఇరుపక్షాలు అంగీకరించిన కేసులను పరిష్కరిస్తే కోర్టులపై ఒత్తిడి తగ్గుతుంది. తీర్పులకు సమయం నిర్దేశిరచాలనే వాదన కూడా వుంది. న్యాయస్థానాలకు పూర్తిస్థాయిలో సహకరించాల్సిన కేంద్రం అనేక సందర్భాల్లో



అడ్డుపడటం, అడ్డగోలుగా విమర్శలు చేయడం పరిపాటిగా వుంది. న్యాయమూర్తుల నియామకానికి ప్రత్యేకంగా ఒక జ్యుడీషియల్ కమిషన్ ఉండాలన్న చర్చ చాలాకాలంగా వుంది. అయితే నేడు కొలీజియం వ్యవస్థ ఆ బాధ్యత నిర్వహిస్తోంది. కాని కేందప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం నియామకాలను తీవ్రంగా జాప్యం చేస్తోంది. ఏవో సాకులు చూపి తిరస్కరిస్తోంది. ఇంకొన్ని సందర్భాల్లో కొలీజియం, కేంద్ర న్యాయశాఖ మధ్య వివాదాస్పదం అవుతున్నవే వున్నాయి. భారత రాజ్యాంగం, పాలన, శాసన, న్యాయ వ్యవస్థల మధ్య స్పష్టమైన లక్ష్మణరేఖలను నిర్దేశించింది. పాలకులు వాటిని ఉల్లంఘించిన సందర్భాల్లోనే ఇటువంటి పరిస్థితి ఏర్పడుతోంది. నాగరిక సమాజంలో సత్వర న్యాయం అందించడం వ్యవస్థ బాధ్యత. అందుకోసం సుప్రీంకోర్టు తీసుకుంటున్న చొరవకు కేంద్రం వీలైనంత తోడ్పాటు నందించాలి. అప్పుడే పెండింగ్‌కు అడ్డుకట్టపడటంతోపాటు సత్వర న్యాయం అందేందుకు అవకాశముంటుంది. ఎందుకంటే ఇటీవల హైదరాబాద్ జర్నలిస్టుల హౌజింగ్ సొసైటీ కేసులో దాదాపు 17 ఏళ్ల నిరీక్షణ తరవాత పరస్పర విరుద్ధ తీర్పులు వచ్చాయి. జస్టిస్ ఎన్‌వి రమణ ఇచ్చిన తీర్పుకు భిన్నంగా మళ్లీ తదుపరి సిజెఐ తీర్పు వచ్చింది. దీనిపై అప్పీల్‌కు వెళితే కేసును కొట్టివేశారు. ఇది సమాజంలో ఓ పేదవర్గాల కోసం ప్రభుత్వం అనుసరించి గృహ సంబంధ విషయం. దీంతో జర్నలిస్టులు రోడ్డున పడ్డారు. ఇందులోని మెరిట్స్‌ను గుర్తించక పోవడంతో జర్నలిస్టులు ఆందోళనకు కారణమయ్యింది. కేసులో ప్రభుత్వం కూడా గట్టిగా వాదనలు ఇవ్వలేకపోయింది. జర్నలిస్టులకు 17 ఏళ్ల క్రితం ఎందుకు ఇంటి స్థలాలు ఇవ్వాల్సి వచ్చిందో ధర్మాసనం ముందుంచ లేపోయింది. కేసు వేసిన వారు సైతం జర్నలిస్టుల ఆర్థిక స్థితిగతులను తెలుసు కోకుండా కోర్టుకు వెళ్లారు. ఇదంతా ఎందుకుంటే కేసు ఏదాదిలోనే తేలివుంటే సమస్య వచ్చేది కాదు. అప్పుడే ప్రభుత్వాలు తగిని నిర్ణయాలు తీసుకునే వీలుండేది. కేవలం కోర్టుల్లో దశాబ్దన్నరం కాలంగా నలిగిపోచి చివరకు అన్యాయం జరగడంతో తమ సమస్యలపై నిరాహార దీక్షలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం లోపం కూడా ఉంది. అందుకే కేసులు సత్వరంగా పరిష్కారం కావాలంటే న్యాయమూర్తుల సంఖ్యను ఇప్పుడున్న దానికి కనీసం పదివంతులు పెంచాలి. అప్పుడు త్వరగా పరిష్కారం దక్కుతుంది. జైళ్లలో మగ్గుతున్న ఎందరికో ఊరట కలుగుతుంది. లేకుంటే కేసులు తేలకుండానే ట్రయల్ ఖైదీలు జైళ్లల్లో మగ్గాల్సి వస్తోంది. జాతీయ జ్యుడీషియల్ గ్రిడ్ ఇచ్చిన తాజా సమాచారం ప్రకారం 69,605 సివిల్, 18,887 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు 2020 వేసవి సెలవుల సమయంలో అనేక సంస్కరణలను తీసుకొచ్చారు. ప్రస్తుత సిజెఐ బిఆర్ గవారు వేసవి సెలవుల్లోనూ పాక్షికంగా పనిచేసే పద్ధతిని తీసుకొచ్చారు. కొల్‌కతా, మహారాష్ట్ర హైకోర్టుల్లో కేసుల పెండింగ్ అత్యధికంగా ఉంది. జనాభాతో పోల్చితే న్యాయమూర్తుల నిష్పత్తి ప్రపంచ వ్యాప్తంగా పరిశీలిస్తే మనదేశంలోనే అత్యంత తక్కువగా ఉండటం కేసుల పెండింగ్‌కు కారణమవుతోందన్న వాదన ఉంది. . అమెరికాలాంటి దేశాల్లో సగటున ప్రతి 10 లక్షల జనాభాకు 150 మంది వరకూ న్యాయమూర్తులుండగా, మన దేశంలో 21 మంది న్యాయమూర్తులు మాత్రమే ఉన్నారు. కోర్టుల్లో కేసులు భారీగా పెరిగిపోవడానికి అనేక కారణాలున్నాయి. కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ కేసులతో న్యాయస్థానాలపై ఒత్తిడి తీసుకొస్తున్నాయి. దేశంలో కార్పొరేట్, అవినీతి, నేరగ్రస్థ రాజకీయాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి. చట్టసభల సభ్యుల్లో 45 శాతం మందికిపైగా క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాధాన్యతా క్రమంలో చట్ట సభల సభ్యులు, అధికారులపై కేసులను పరిష్కరించడం కూడా అత్యవసరం. ఇక ఇతర కారణాల విషయానికి వస్తే న్యాయవాదులు తరచూ వాయిదాలు కోరడం, స్థానికంగా పరిష్కరించదగినవి కూడా కోర్టులకు తీసుకురావడం తదితర కారణాల వల్ల అసంఖ్యాకంగా కేసులు పెరిగిపోతున్నాయి. రిటైర్డ్ న్యాయమూర్తుల సేవలు సివిల్ కేసుల విషయంలో వినియోగించుకుని సుదీర్ఘకాలంగా వాయిదాలున్న కేసుల సంగతి తేల్చాలనే సూచన ఉంది.

## 60కోట్ల మోసం కేసులో విచారణ

**● ముంబై పోలీస్ విచారణకు శిల్పాశెట్టి**



**ముంబై,అక్టోబర్7:** ఓ వ్యాపారవేత్తను రూ.60 కోట్ల మేర మోసం చేసిన కేసులో నటి శిల్పాశెట్టి దంపతులు ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ కేసులో తాజాగా శిల్పాశెట్టిని ముంబయి పోలీసులు విచారించారు. 4 గంటల పాటు విచారించిన పోలీసులు ఆమె బ్యాంక్ స్టేట్‌మెంట్ వివరాలు, ఇతర ఖర్చుల గురించి ఆరాతీసినట్లు తెలుస్తోంది. కొన్ని కీలకమైన పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు కథనాలు వస్తున్నాయి.ఈ కేసు విషయంలో శిల్పాశెట్టి భర్త రాజ్‌కుంద్రాను కూడా ఇటీవల పోలీసులు విచారించారు. కొన్ని కంపెనీల్లో రూ.60కోట్లు పెట్టుబడులుగా పెట్టినట్లు ఆ సమయంలో ఆయన వెల్లడించారు. దీంతో ఈ నిధుల్ని నిజంగానే సంబంధిత కంపెనీలకు మళ్లించారా లేదా ఇతర వ్యక్తిగత ఖర్చులకు ఉపయోగించారా అనే దానిపైనా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇందులోభాగంగా శిల్పాను విచారించినట్లు తెలుస్తోంది. ఇక శిల్పా దంపతులు ఇటీవల థాయ్‌లాండ్ పర్యటనకు వెళ్లడానికి అనుమతి కోరుతూ బాంబే హైకోర్టులో పిటిషన్ వేయగా కోర్టు దాన్ని తిరస్కరించింది. ఈ కేసు విషయంలో స్పష్టత వచ్చేవరకూ విదేశాలకు వెళ్లడానికి వీల్లేదని పేర్కొంది.

## జూబ్లీహిల్స్ కాంగ్రెస్‌కు భారీ షాక్

**● కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్‌పై క్రిమినల్ కేసు**

**● ఓటరు కార్డులు పంచడంపై కేసు నమోదు**



**హైదరాబాద్,అక్టోబర్7:** జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్‌పై క్రిమినల్ కేసు నమోదు అయ్యింది. మధురా నగర్ పోలీస్ స్టేషన్‌లో జూబ్లీహిల్స్ ఎన్నికల అధికారి రజినీకాంత్ రెడ్డి నవీన్ యాదవ్‌పై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నవీన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా నవీన్ యాదవ్ ఓటర్ కార్డులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. దీన్ని ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యగా భావించిన ఎన్నికల సంఘం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నవీన్ యాదవ్ మీద బీఎన్ఎస్ 170, 171, 174తో పాటు ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద కేసు నమోదు అయ్యింది. ఎన్నికల సంఘం నిబంధనల ఉల్లంఘనల మీద అధికారుల సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్‌పై క్రిమినల్ కేసు నమోదు అవ్వడం కాంగ్రెస్‌కు భారీ దెబ్బగా చెప్పుకొవచ్చు. నవీన్ యాదవ్‌ను జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థిగా అనుకున్నట్లు రాజకీయా వర్గాల్లో వార్తలు కూడా వినిపించాయి. నవీన్ యాదవ్‌పై కేసు నమోదు అవ్వడం చర్చనీయాంశంగా మారింది. అయితే తాజాగా.. ఎన్నికల సంఘంకు ఎంపీ రఘునందన్ రావు, నవీన్ యాదవ్ జూబ్లీహిల్స్‌లో ఓటర్ కార్డులు అందజేస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ జరిపిన ఎన్నికల సంఘం.. నవీన్ యాదవ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది.



## బంగారం ధరలు మరింత ప్రియం

**● మళ్లీ పెరిగిన పదిగ్రాములు ధర**

**హైదరాబాద్,అక్టోబర్7:** బంగారం ధరలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. పసిడి పరుగులు ఆగడం లేదు. ప్రతిరోజు సరికొత్త గరిష్టాలకు చేరుకుంటూ రికార్డులు నమోదు చేస్తోంది. తాజాగా బంగారం ధర మళ్లీ పెరిగింది. క్రమంగా రోజురోజుకు పెరుగుతూ లక్షన్నరకు చేరువగా పరుగులు తీస్తోంది. మంగళవారం హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం రూ.1,23,850కి చేరుకుంది. 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,11,500గా ఉంది. వెండి కిలో రూ.1,54,350కి చేరింది. సోమవారం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,23,460 ఉండగా.. మంగళవారం మరో రూ.390 పెరిగింది. కిలో వెండి ధర రూ.1,54,200 ఉండగా.. తాజాగా మరో రూ.150 పెరిగి రూ.1,54,350కి చేరింది. అమెరికా షట్‌డౌన్ కొనసాగడం, ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లను ఈ ఏడాదిలో మరింత తగ్గిస్తుందనే అంచనాల నేపథ్యంలో ఇన్వెస్టర్ల తమ నిధులను బంగారం, వెండిపైకి మళ్లించడం ఈ పరిస్థితికి కారణమని అనలిస్టులు చెబుతున్నారు. పండగల సీజన్ కావడం, అంతర్జాతీయంగా మార్కెట్ల అస్థిరత, డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి పతనం బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది

## దేశం నివ్వెర పోయే ఘటన

**● చీఫ్ జస్టిస్‌పై దాడి**

**అత్యంత హేయం**



**న్యూఢిల్లీ,అక్టోబర్7:** దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ పై మదం తలకెక్కించుకున్న ఓ న్యాయవాది బూటు విసిరి దాడికి యత్నించిన ఘటన అత్యంత హేయమైన చర్యగా చూడాలి. ఇది మాటలకు అందని ఆందోళనకర ఘటనగా చూడాలి. సుప్రీం కోర్టులో ఓ న్యాయవాది ఎంత మదమెక్కిన వాడు అయితే తప్ప ఇలాంటి ఉన్మాద చర్యకు పాల్పడడు. ఈ ఘటన దేశం యావత్తూ ఆందోళనకు గురిచేసింది. ప్రధాన న్యమూర్తిపైనే దాడికి తెగబడడం క్షమించరాని నేరం. సోమవారం అత్యున్నత న్యాయస్థానంలో, అదీ ఒక కేసు విచారణ సందర్భంగా వాదనలు జరుగుతుండగా దుండగ మనస్తత్వం నిలువెల్లా నింపుకున్న ఒక లాయర్ ఎలాంటి జంకుగొంకూ లేకుండా చీఫ్ జస్టిస్ పోడియం వైపు దూసుకెళ్లి దాడికి తెగబడటాన్ని తీవ్రంగా పరిగణించాలి. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించక పోయివుంటే..దాడి జరిగి ఉండేది. ఈ హఠాత్పరిణామం తెలిసిన దేశ ప్రజలు ఆందోళనకు గురయ్యారు. కోర్టులో తీవ్ర గందరగోళం నెలకొనగా, ఇటువంటి బెదిరింపులు తనను ప్రభావితం చేయబోవని జస్టిస్ గవాయ్ చూపిన నిబ్బరం న్యాయవ్యవస్థపై గౌరవాన్ని, మన జ్యుడీషియరీ ధృఢత్వాన్ని ఇనుమడింపజేసింది. జస్టిస్ గవాయ్ పై దాడి ఉదంతంపై దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. రాజ్యాంగ రక్షణను అభిలషించే ప్రతి ఒక్కరూ చీఫ్ జస్టిస్‌పై దాడిని ఖండించాల్సిందే. స్టిస్ గవాయ్ పై దాడి సాదాసీదా యాదృచ్ఛికంగా చోటు చేసుకున్నది కాదు. జస్టిస్ గవాయ్ పై దాడి రాజ్యాంగానికి, ప్రజలకు అవమానం. గవాయ్ పై దాడిని తరతమ భేదం లేకుండా పార్టీలు, సంస్థలు, వ్యక్తులు నిరసిస్తున్నారు. చీఫ్ జస్టిస్ బాధ్యతలు స్వీకరించాక మే నెలలో తొలిసారి స్వంత రాష్ట్రం ముంబరు పర్యటనకు వెళ్లినప్పుడు, అక్కడి బిజెపి ప్రభుత్వం కనీస ప్రొటోకాల్ పాటించకుండా ఘోరంగా అవమానపర్చింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపి, ముంబరు పోలీస్ కమిషనర్ వంటి ముఖ్య అధికారులు గవారు పర్యటనకు ఉద్దేశపూర్వకంగా డుమ్మాకొట్టారు.

# చేతకాని దద్దమ్మలనుకున్నామే 32 ఫోర్లు, 3 సిక్సర్లతో టీమిండియాకు ముందే వార్నింగ్ ఇచ్చారు



ఫామ్‌లేమి చాలామంది ఆటగాళ్లను జట్టుకు దూరం చేస్తుంది. సీనియర్ ఆటగాళ్లు అయినా సరే.! ఈ సమస్య ఉంటే కచ్చితంగా చోటు కోల్పోవాల్సిందే. ఇప్పుడు మేము చెప్పబోయే ఆటగాళ్లు కూడా ఇదే కోవకు వస్తారు. వీరిద్దరూ టీమిండియాపై తన సత్తా చాటారు. అయితే ఆ తర్వాత ఫామ్ లేమితో సతమతమయ్యారు. తుది జట్టులో చోటు కోల్పోయారు. మరి వారెవరో ఇప్పుడు తెలుసుకుందామా. మ్యాట్ రెన్‌షా, మార్నస్ లబూషేన్.. తాజాగా జరుగుతోన్న షెఫ్ఫీల్డ్ షీల్డ్ ట్రోఫీలో ఈ ఇద్దరు ఆటగాళ్లు మరోసారి తమ సత్తా చాటారు. క్వీన్స్‌ల్యాండ్ తరపున బరిలోకి దిగిన రెన్‌షా, లబూషేన్.. రెండు సెంచరీలతో మోత మోగించారు. క్వీన్స్‌ల్యాండ్ జట్టుకు కెప్టెన్‌గా ఉన్న లబూషేన్.. మరోసారి కీలక ఇన్నింగ్స్ ఆడి.. తిరిగి తన ఫామ్ రాబట్టుకున్నాడు. ఇద్దరు ఆటగాళ్ల సెంచరీలతో ఆ జట్టు స్కోర్ 612 పరుగులకు చేరింది. లబూషేన్ మొత్తంగా 206 బంతులు ఎదుర్కొని 160 పరుగులు చేశాడు. ఇందులో 17 ఫోర్లు, 2 సిక్సర్లు ఉన్నాయి. అటు ఓపెనర్‌గా దిగిన రెన్‌షా 235 బంతులు ఎదుర్కొని 15 ఫోర్లు, 1 సిక్స్‌తో 128 పరుగులు చేశాడు. టీమిండియాపై వీరిద్దరి మంచి రికార్డు ఉంది. ముఖ్యంగా లబూషేన్ మిడిలార్డర్‌లో టీమిండియాపై ఎక్కువగా పరుగులు రాబట్టి.. ఆస్ట్రేలియా జట్టు భారీ స్కోర్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు. ఇక ఈ మ్యాచ్‌లో టస్మానియా జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 379 పరుగులకు ఆలౌట్ కాగా.. ప్రస్తుతం సెకండ్ ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు నష్టపోయి.. 143 పరుగులు చేసింది. ఇంకా 90 పరుగుల వెనుకబడి ఉంది. ఈ పెర్ఫార్మన్స్‌లతో రెన్‌షా.. టీమిండియాతో జరగబోయే వన్డే సిరీస్‌కు ఎంపిక కావడం గమనార్హం. ఆస్ట్రేలియా జట్టు భారత్‌మిచెల్ మార్ష్ (కెప్టెన్), జేవియర్ బార్ట్‌లెట్, అలెక్స్ కారీ, కూపర్ కొన్నోలీ, బెన్ ద్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, కామెరాన్ గ్రీన్, జోష్ హాజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మిచెల్ ఓవెన్, మాథ్యూ రెన్షా, మాథ్యూ షార్ట్, మిచెల్ స్టార్క్, ఆడమ్ జంపా ఆస్ట్రేలియా జట్టు భారత్(మొదటి రెండు మ్యాచ్‌లు)మిచెల్ మార్ష్ (కెప్టెన్), సీన్ అబాట్, జేవియర్ బార్ట్‌లెట్, టిమ్ డేవిడ్, బెన్ ద్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, జోష్ హాజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కుహ్నెమాన్, మిచెల్ ఓవెన్, మాథ్యూ షార్ట్, మార్కస్ స్టోయినిస్, ఆడమ్ జంపా

# బంగారం హై జంప్ ఒక్కరోజే 2,700 పెరిగిన తులం ధర



సామాన్యులను ఊరిస్తున్న బంగారం.. సంపన్నులనూ సవాల్ చేస్తున్నది. కనీవినీ ఎరుగని రీతిలో రికార్డుల్ని బద్దలుకొడుతున్న పసిడి ధరలు.. రాకెట్ వేగంతో పైపైకి పరుగులు పెడుతున్నాయి. సోమవారం ఒక్కరోజే తులం రేటు దాదాపు రూ.3,000 ఎగబాకింది. ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాములు రూ.2,700 ఎగిసి, మునుపెన్నడూ లేనివిధంగా రూ.1,23,300 పలికింది. దీంతో భారతీయ స్పాట్ మార్కెట్‌లో నయా ఆల్‌టైమ్ హై రికార్డు నమోదైనట్టు అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలిపింది. బంగారం ధరలు ఆకాశమే హద్దుగా దూసుకు పోతున్నాయి. పట్టపగ్గాల్లేకుండా పరుగులు పెడుతున్న పసిడి రేటు. ఒక్కరోజే తులం దాదాపు రూ.3 వేలు ఎగబాకింది. దేశ, విదేశీ ప్రతికూల పరిస్థితులు పుత్తడి విలువను అమాంతం పెంచేస్తున్నాయి. ఇదే దూకుడు కొనసాగితే ఈ పండుగ సీజన్‌లో కొత్త రికార్డులకు కొదవే ఉండదనిపిస్తున్నది. హైదరాబాద్‌లో. హైదరాబాద్‌లో బంగారం ధరల విషయానికొస్తే.. 24 క్యారెట్ తులం రూ.1,20,330గా ఉన్నది. సోమవారం రూ.1,370 పెరిగింది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) 10 గ్రాములు రూ.1,250 ఎగిసి రూ.1,10,700 వద్ద నిలిచింది. ఇక కిలో వెండి ధర ఢిల్లీలో రూ.1,57,400గా నమోదైంది. ఈ ఒక్కరోజే రూ.7,400 పుంజుకోవడం గమనార్హం. హైదరాబాద్‌లో మాత్రం రూ.1,53,100గా ఉన్నట్టు జ్యుయెల్లర్స్ తెలిపారు. పండుగ సీజన్ దృష్ట్యా సాధారణ కొనుగోలుదారుల నుంచి వెండికి డిమాండ్ ఉందని వ్యాపార వర్గాలు చెప్తున్నాయి. అలాగే పరిశ్రమల నుంచి కూడా ఆదరణ కనిపిస్తున్నదని, దీంతో ధరలు దౌడు తీస్తున్నాయని పేర్కొంటున్నారు. ధనత్రయోదశికి ఎంత? ఈ నెల 18న ధనత్రయోదశి వస్తున్నది. ఈ రోజున బంగారం, వెండి కొనుగోళ్లు శుభప్రదమని దేశంలోని మెజారిటీ ప్రజల విశ్వాసం. అయితే మార్కెట్‌లో ఇప్పుడున్న పరిస్థితుల దృష్ట్యా.. అప్పటికల్లా రేట్లు ఇంకా పెరిగిపోవచ్చన్న అంచనాలైతే ఉన్నాయి. ఇదే జరిగితే 24 క్యారెట్ గోల్డ్ 10 గ్రాములు రూ.1,50,000 దాటిపోవచ్చన్న అభిప్రాయాలైతే బలంగా వినిపిస్తున్నాయి. కిలో వెండి రేటూ రూ.1,80,000 దాటుతుందనే అంచనాలున్నాయి. ఇప్పటికే ఫ్యూచర్ మార్కెట్‌లో రేట్లు భగ్గుమంటున్నాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)పై డిసెంబర్ డెలివరీకిగాను 10 గ్రాములు రికార్డు స్థాయిలో రూ.1,20,075 పలికింది. అలాగే కిలో వెండి రూ.1,47,977 పలికింది. దీంతో ఇప్పుడు ఈ స్థాయిలకు మించి ధరలున్నా.. మున్ముందు పెద్దగా కరెక్షన్‌కు అవకాశాల్లేవన్న సంకేతాలైతే వస్తున్నాయి. వ్యాపారుల్లో ఆందోళన. పెరుగుతున్న ధరలతో వ్యాపారాలు ఏ మేరకు సాగుతాయోనన్న భయాందోళనలు నగల వర్తకుల్లో నెలకొన్నాయి. ధరలు స్థిరంగా ఉంటేనే అమ్మకాలు బాగుంటాయని, ఇలా రోజుకింత పెరిగితే కొనేవారు సైతం ముందుకు రాలేరని అంటున్నారు. అసలే పండుగ సీజన్ కావడంతో దుకాణదారులు ఆఫర్లు పెట్టిమరీ కొనుగోలుదారులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. నిజానికి దీపావళి ముందు వారం రోజులు, తర్వాత వారం రోజులు గోల్డ్ మార్కెట్ అంతా సందడిగా ఉంటుంది. కానీ ఈ రేట్లతో ఈసారి కళ తప్పుతుందో ఏమోనన్న భయాలను మాత్రం వ్యక్తపరుస్తున్నారు చాలామంది. అయినప్పటికీ కొనుగోళ్లు బాగానే ఉంటాయన్న ఆశాభావాన్ని కనబరుస్తున్నారు.

# ఇండియాతో సిరీస్.. ఆసీస్ వన్డే, టీ20 కెప్టెన్‌గా మిచెల్ మార్ష్



సిడ్నీ: ఇండియాతో జరగనున్న వన్డే, టీ20 సిరీస్‌కు ఆస్ట్రేలియా తమ జట్లను ప్రకటించింది. గాయం నుంచి కోలుకుంటున్న ప్యాట్ కమ్మిన్స్‌ను ఈ సిరీస్‌కు ఎంపిక చేయలేదు. ఆస్ట్రేలియా వన్డే, టీ20 సిరీస్‌కు మిచెల్ మార్ష్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. అక్టోబర్ 19వ తేదీ నుంచి ఇండియా, ఆస్ట్రేలియా మధ్య తొలి వన్డే జరగనున్నది. వన్డే జట్టులో ఆస్ట్రేలియా కొన్ని మార్పులు చేసింది. వన్డే స్క్వాడ్ నుంచి లబుషేన్‌ను తప్పించింది. అతని స్థానంలో మాథ్యూ రెన్‌షాను తీసుకున్నది. రెన్‌షా ఇప్పటి వరకు ఆస్ట్రేలియా తరపున 14 టెస్టులు ఆడాడు. అయితే 2022 పాకిస్థాన్ టూరులో అతను వన్డే జట్టులో ఉన్నా.. ఇంకా అరంగేట్రం చేయలేదు. కమ్మిన్స్ లేకపోవడంతో.. మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్ ప్రధాన బౌలర్ల పాత్రను పోషించనున్నారు. వీరితో పాటు పేస్ బౌలింగ్ బృందంలో గ్జావియర్ బార్ట్‌లెట్, బెన్ ద్వార్షియస్ ఉన్నారు. బ్యాటర్ రెన్‌షా గత సీజన్‌లో క్వీన్స్‌ల్యాండ్ తరపున భారీగా పరుగులు సాధించాడు. అతను 50 సగటుతో 350 రన్స్ చేశాడు. ఇటీవల శ్రీలంకతో జరిగిన సిరీస్‌లో 80, 106, 62 రన్స్ స్కోర్ చేశాడు. పెర్త్‌లో జరగనున్న ఫస్ట్ వన్డే మ్యాచ్‌కు అలెక్స్ క్యారీ దూరం కానున్నాడు. అక్టోబర్ 15వ తేదీన ఓవల్‌లో జరగనున్న షీఫీల్డ్ షీల్డ్ మ్యాచ్‌లో ఆడనున్నాడు. మణికట్టుకు సర్జరీ కావడం వల్ల గ్లెన్ మ్యాక్స్‌వెల్‌ను టీ20 సిరీస్‌ను తప్పించారు. తొలి రెండు టీ20 లకు మాత్రమే ఆస్ట్రేలియా జట్టును ప్రకటించింది. ఇండియాతో మొత్తం మూడు వన్డేలు, అయిదు టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. వన్డే జట్టు: మిచెల్ మార్ష్, గ్జావియర్ బార్ట్‌లెట్, అలెక్స్ క్యారీ, కూపర్ కన్నోలీ, బెన్ ద్వార్షియస్, నాథన్ ఎల్లిస్, కెమరూన్ గ్రీన్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిష్, మిచెల్ ఓవన్, మాథ్యూ రెన్‌షా, మాథ్యూ షార్ట్, మిచెల్ స్టార్క్, ఆడమ్ జంపా టీ20 జట్టు: మిచెల్ మార్ష్, సీన్ అబాట్, గ్జావియర్ బార్ట్‌లెట్, టిమ్ డేవిడ్, బెన్ ద్వార్షియస్, నాథన్ ఎల్లిస్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కుహనెమన్, మిచెల్ ఓవన్, మాథ్యూ షార్ట్, మార్కస్ స్టోయినిస్, ఆడమ్ జంపా.

# వేలు దాటిన నిఫ్టీ టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే.




దేశీయ సంస్థాగత మదుపర్లు కొనుగోళ్లు సానుకూలాంశంగా మారడంతో వరుసగా నాలుగో రోజు కూడా సూచీలు లాభాల బాటలో సాగుతున్నాయి. మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల్లో కొనుగోళ్లు సూచీలను ముందుకు నడిపిస్తున్నాయి. విదేశీ మదుపర్లు అమ్మకాలు కొనసాగుతున్నప్పటికీ నిఫ్టీ 25 వేల మైలురాయిని చేరుకోవడం విశేషం. మరోవైపు ఐపీవో జోష్ కూడా సూచీలను ముందుకు నడిపిస్తోంది. దీంతో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో కదలాడుతన్నాయి. సోమవారం ముగింపు (81, 790)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం దాదాపు 70 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత పైకి ఎగబాకింది. ప్రస్తుతం ఉదయం 10:15 గంటల సమయంలో సెన్సెక్స్ 344 పాయింట్ల లాభంతో 82, 134 వద్ద కొనసాగుతోంది. మళ్లీ 82 వేల మార్క్‌కు చేరుకుంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 100 పాయింట్ల లాభంతో 25, 177 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్‌లో సీడీఎస్-ఎల్, ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్, పీబీ ఫిన్‌టెక్, జియో ఫైనాన్సియల్, పెట్రోనాట్ ఎల్ఎన్‌జీ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి ట్రెంట్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్స్, యాక్సిస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, టీసీఎస్ మొదలైన షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 162 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 210 పాయింట్ల లాభంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 88.73గా ఉంది.

# జట్టు సంస్కృతిని రోహిత్ దెబ్బతీసాడా?




ఆస్ట్రేలియా పర్యటనకు త్వరలో వెళ్లనున్న భారత జట్టులో సెలక్టర్లు మాజీ సారథి రోహిత్ శర్మను కెప్టెన్‌గా తప్పించి ఆ పగ్గాలను శుభ్‌మన్ గిల్‌కు అందజేశారు. అయితే ఉన్నఫళంగా రోహిత్‌ను తప్పించడంపై అతడి అభిమానులతో పాటు క్రికెట్ విశ్లేషకుల్లోనూ బిన్నాభిప్రాయాలు వెలువడుతున్నాయి. కానీ హిట్‌మ్యాన్ గనుక ఈ ఫార్మాట్‌లో సారథిగా కొనసాగితే అది జట్టుకు మంచిదికాదని.. 2027 వన్డే ప్రపంచకప్ ప్రణాళికల్లో ఉన్న టీమ్‌కు ఇది చేటు చేస్తుందని బీసీసీఐ భావిస్తునట్టు తెలుస్తున్నది. జాతీయ మీడియాలో వచ్చిన ఓ కథనం ప్రకారం.. 'రోహిత్ స్థాయి వ్యక్తి నాయకుడి పాత్రలో ఉంటే అతడు డ్రెస్సింగ్ రూమ్‌లో తన మార్కు ఫిలాసఫీతో జట్టును ప్రోత్సహిస్తాడు. కానీ అతడు వన్డేల్లో మాత్రమే ఆడుతాడు. రోహిత్ ఆడేవీ చాలా తక్కువ మ్యాచ్‌లు. ఇది జట్టు సంస్కృతిని దెబ్బతీసే ప్రమాదం లేకపోలేదు. ఒకరే సారథిగా ఉంటే డ్రెస్సింగ్ రూమ్‌లో సానుకూల వాతావరణం ఉంటుంది' అని బీసీసీఐ ప్రతినిధి ఒకరు చెప్పారు. కాగా టెస్టులు, టీ20లకు గుడ్‌బై చెప్పిన రోహిత్.. వన్డేల్లో మాత్రమే కొనసాగనున్నాడు. 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడాలనే లక్ష్యంతో ఉన్నప్పటికీ వయసు, ఫామ్ కారణంగా అప్పటిదాకా హిట్‌మ్యాన్ జట్టులో ఉంటాడా? ఉండడా? అన్నదీ అనుమానమే. కానీ బీసీసీఐ మాత్రం ప్రపంచకప్‌నకు ఇప్పట్నుంచే జట్టును సంసిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. గిల్‌కు వన్డే సారథ్య బాధ్యతలు అప్పగించిందీ అందుకేనని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ చెప్పకనే చెప్పాడు. ఇప్పటికే టెస్టుల్లో తనదైన ముద్ర వేస్తున్న గిల్‌కు వన్డేల్లోనూ తన మార్కును చూపించేందుకు బోర్డు అతడికి అతడిని సూర్యకుమార్‌కు డిప్యూటీగా నియమించి త్వరలోనే మూడు ఫార్మాట్లలోనూ పగ్గాలు అందజేసేందుకు సిద్ధమవుతున్నది. హెడ్‌కోచ్ గంభీర్ సైతం ఈ నిర్ణయం (గిల్‌కు కెప్టెన్సీ) వెనుక ఉన్నట్టు తెలుస్తున్నది. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో దారుణ పరాభవం తర్వాత టీమ్‌ను మొత్తం తన అధీనంలోకి తీసుకున్నట్టు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. భారత జట్టులో ఫార్మాట్‌కు ఒక కెప్టెన్ ఫార్ములా సెట్ కాదని గట్టిగా విశ్వసిస్తున్న బోర్డు.. ఈ క్రమంలో రోహిత్‌ను వన్డే సారథిగా కొనసాగించి జట్టు సంస్కృతిని దెబ్బతీయడం ఇష్టం లేకే హిట్‌మ్యాన్‌ను తప్పించినట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# వడ్డీ లేకుండా ఇచ్చే లోన్స్ ఇవే




మనదేశంలో లోన్ అవసరం రాని వాళ్లు చాలా తక్కువ మంది ఉంటారు. రకరకాల అవసరాల దృష్ట్యా చాలామందికి ఒక సందర్భంలో లోన్ తీసుకునే పరిస్థితి ఏర్పడుతుంది. అయితే సాధారణంగా లోన్ అన్నాక కచ్చితంగా కొంత శాతం వడ్డీ ఉంటుంది. అయితే కొన్ని ప్రత్యేక అవసరాలను దృష్టిలో ఉంచుకుని వడ్డీ లేని రుణా లను కూడా బ్యాంకులు మంజూరు చేస్తుంటాయి. అలాంటి లోన్స్ ఏంటో ఇప్పుడు చూద్దాం. ఎడ్యుకేషన్ లోన్‌ఉన్నత చదువులు చదువుకునేందుకు స్తోమత లేనివాళ్లకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు ఇస్తుంది. ఈ లోన్ సాయంతో చదువు పూర్తి చేసి.. ఆ తర్వాత నిర్ణీత కాలంలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఈ లోన్స్ ప్రభుత్వమే కాకుండా కొన్ని బ్యాంక్స్ కూడా మంజూరు చేస్తుంటాయి. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఈ లోన్స్ సాయపడతాయి. రైతు రుణాలురైతులకు కూడా మనదేశంలో వడ్డీ లేని రుణాలు లభిస్తాయి. దీనికై చాలా పథకాలు బ్యాంక్ స్కీములు కూడా ఉన్నాయి. ఈ లోన్స్ ను మంజూరు చేసిన తర్వాత నిర్ణీత కాలానికి తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. వీటిపై ఎలాంటి వడ్డీ భారం ఉండదు. అయితే కొన్ని సార్లు అసలు మొత్తాన్ని కూడా మాఫీ చేస్తుంటాయి ప్రభుత్వాలు. ఆర్థికంగా వెనుకబడిన రైతులను ఆదుకునేందుకు ఈ లోన్స్ ఉపయోగపడతాయి. ఎందుకంటే క్రెడిట్ కార్డు ద్వారా వాడిన మొత్తాన్ని నెల రోజుల లోపు చెల్లిస్తే.. దానిపై ఎలాంటి వడ్డీ ఉండదు. ఇక కొన్ని సార్లు క్రెడిట్ కార్డుపై నో కాస్ట్ ఈఎంఐలు కూడా లభిస్తుంటాయి. ఇవి కూడా వడ్డీ లేని రుణాల కిందకే వస్తాయి. మైక్రో ఫైనాన్స్ సామాజిక అభివృద్ధి కోసమని కొన్ని మైక్రోఫై నాన్స్ సంస్థలు వడ్డీ లేని రుణాలను అందిస్తాం యి. ఇవి చిన్న చిన్న సంఘాలు, మహిళలకు, వీధి చేసుకునేవారికి ఎక్కువ అందుబాటులో ఉంటాయి.

# మీ నాన్నతో కలిసి ఆటో తోలుకో : తనను ట్రోలింగ్ చేశారన్న సిరాజ్



న్యూఢిల్లీ: టీమ్‌ఇండియా స్టార్ స్పీడ్‌స్టర్ మహమ్మద్ సిరాజ్ పలు ఆసక్తికర అంశాలలను అభిమానులతో పంచుకున్నాడు. ఇటీవలి ఇంగ్లండ్ టెస్టు సిరీస్‌తో పాటు కెరీర్ తొలినాళ్లలో ఎదురైన చేదు అనుభవాలు, కెప్టెన్ గిల్ మద్దతు, సోషల్‌మీడియాలో ట్రోలింగ్ లాంటి వాటిపై మాట్లాడాడు. 'కెరీర్ మొదట్లో అప్పటి టీమ్‌ఇండియా కెప్టెన్ ధోనీ ఇచ్చిన సలహాలు, సూచనలు బాగా పనిచేశాయి. మెరుగ్గా రాణిస్తే మెచ్చుకునేవాళ్లే..విఫలమైనప్పుడు తీవ్ర విమర్శలు చేస్తారన్న ధోనీ మాటలు నమ్మాను. ఇతరులు ఏమంటున్నారో అసలు పట్టించుకోవద్దు. బాగా ఆడినప్పుడు ప్రపంచం మొత్తం నీతోనే ఉంటుంది, అదే ఫెయిల్ అయితే వెళ్లి మీ నాన్నతో కలిసి ఆటో తోలుకో అన్న వాళ్లు ఉన్నారు. ధోనీ చెప్పినట్లు సోషల్‌మీడియాను ఫాలో కావడం పూర్తిగా మానేశాను. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో సత్తాచాటడం ఆత్మవిశ్వాసాన్నిచ్చింది. బుమ్రా గైర్హాజరీలో జట్టు బౌలింగ్ భారాన్ని మోశాను. లార్డ్స్ టెస్టు ఓటమి తీవ్ర మనోవేదనకు గురిచేసినా..ఓవల్ విజయం అది మరిచిపోయేలా చేసింది' అని సిరాజ్ పేర్కొన్నాడు.

# అద్భుతం సృష్టించిన స్టాక్ రూ.1 లక్ష పెట్టుబడిని రూ.1.84 కోట్లుగా మార్చింది!



స్టాక్ మార్కెట్ బూమ్‌ను ఎదుర్కొంటోంది. అంటే చాలా కంపెనీల షేర్లు పెరుగుతున్నాయి. పెట్టుబడిదారులు భారీగా సంపాదిస్తున్నారు. కానీ ఈ బూమ్ మధ్య ఒక చిన్న కంపెనీ షేర్లు మిమ్మల్ని ఆశ్చర్యపరిచే సంచలనాన్ని సృష్టించాయి. ఆ కంపెనీ పేరు ఇండో థాయ్ సెక్యూరిటీస్ లిమిటెడ్. ఒకప్పుడు 2 రూపాయల కంటే తక్కువ ధర పలికిన ఈ కంపెనీ షేర్లు ఇప్పుడు పెట్టుబడిదారులను లక్షాధికారులుగా మార్చాయి. దీని స్టాక్ చూపరులు కూడా ఆశ్చర్యపోయేంత లాభాలను ఆర్జించింది. ఒక నెలలో డబ్బు రెట్టింపు:ముందుగా ఇటీవలి పరిస్థితి గురించి మాట్లాడుకుందాం. గత నెలలోనే ఈ స్టాక్ 90% కంటే ఎక్కువ పెరిగింది. సరళంగా చెప్పాలంటే, ఎవరైనా ఒక నెల క్రితం రూ.100,000 పెట్టుబడి పెట్టి ఉంటే వారి ఖాతాలో ఈరోజు రూ.190,000 ఉంటుంది. దీని అర్థం కేవలం ఒక నెలలోనే రూ.90,000 ప్రత్యక్ష లాభం. కూడా ఇది 3.31%లాభపడి రూ.315ను అధిగమించింది.

# మళ్లీ వాయిదా పడ్డ డెకాయిట్

కుర్ర హీరో అడివి శేష్ ప్రస్తుతంగూఢచారి 2 సినిమాతో బిజీగా ఉన్నాడు. ఇది కాకుండా శేష్ నటిస్తున్న మరో చిత్రం డెకాయిట్. షానియేల్ డియో దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తుంది. ఈ సినిమాలో మొదట శృతి హాసన్ హీరోయిన్ గా నటించింది. సగం సినిమా షూటింగ్ పూర్తయ్యాక కొన్ని కారణాల వలన ఆమె తప్పుకుంది. ఇక శృతి హాసన్ ప్లేస్ లో మృణాల్ ఠాకూర్ వచ్చి చేరింది.మృణాల్ వచ్చాకా మరోసారి రీ షూట్ చేయడం జరిగింది. దీంతో మొదట అనుకున్న రిలీజ్ వాయిదా పడి ఈసారి డిసెంబర్ 25 కి వస్తున్నట్లు మేకర్స్ ఈ మధ్యనే ప్రకటించారు. అయితే అదే డేట్ న రోషన్ మేక ఛాంపియన్ కూడా రిలీజ్ కానుందని మేకర్స్ నేడు ప్రకటించారు. దీంతో మరోమారు డెకాయిట్ వాయిదా పడినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. మృణాల్ రీషూట్ వలన షూటింగ్ ఫినిష్ కాకపోవడం ఒక కారణమైతే.. డెకాయిట్ షూటింగ్ లో అడివి శేష్ కు ప్రమాదం జరిగిన విషయం తెల్సిందే.షూటింగ్ లో జరిగిన ప్రమాదం నుంచి శేష్ ఇంకా కోలుకోకపోవడం వలన కొంత ఆలస్యం అయ్యిందట. దీంతో పోస్ట్ ప్రొడక్షన్ పనులు పెండింగ్ ఉన్నాయని, ఇవన్నీ డిసెంబర్ లోపు పూర్తి కావని తెలిసి మేకర్స్ ఈ క్రిస్టమస్ రేస్ నుంచి డెకాయిట్ ను తప్పించినట్లు సమాచారం. ఇందులో నిజమెంత అనేది తెలియాల్సి ఉంది. ఒకవేళ క్రిస్టమస్ కు డెకాయిట్ పడితే డేట్ ఎప్పుడు అనేది తెలియాల్సి ఉంది.




# హైదరాబాద్ క్రాస్ రోడ్స్‌లో కొత్త మల్టీప్లెక్స్ 2026 సంక్రాంతికి గ్రాండ్ ఓపెనింగ్!




హైదరాబాద్ సినిమా ప్రియులకు మరో పండుగలాంటి వార్త. సూపర్ స్టార్ మహేష్ బాబు భాగస్వామ్యంతో ఏషియన్ సినిమాస్ రూపొందించిన సినిమాస్ మల్టీప్లెక్స్‌కు ఇప్పటికే బ్రాండ్ వాల్యూ ఏర్పడింది. ఇప్పుడు అదే ఘనతను మరింత ముందుకు తీసుకెళ్లే ప్రయత్నంగా, క్రాస్ రోడ్స్ లో మరో భారీ మల్టీప్లెక్స్ నిర్మాణం జరుపుతున్నారు. ఫేజ్ 2గా రూపొందుతున్న ఈ థియేటర్ నిర్మాణం ప్రస్తుతం తుదిదశకు చేరిందని, ఇంటీరియర్ వర్క్ వేగంగా జరుగుతుందని సమాచారం. 2026 సంక్రాంతి సీజన్‌కి ఈ మల్టీప్లెక్స్ ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ మేరకు ఏషియన్ సినిమాస్, మహేష్ బాబు టీం చకచకా పనులను పూర్తి చేస్తున్నట్లు టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.ఈ కొత్త %ూవీదీ% మల్టీప్లెక్స్‌లో 7 భారీ స్క్రీన్లు ఉండనున్నాయని, అందులో ప్రతీ స్క్రీన్ అత్యాధునిక ప్రొజెక్షన్ టెక్నాలజీ, డాల్బీ అట్మాస్ సౌండ్, ప్రీమియం సీటింగ్, ఎలివేటెడ్ విజువల్ అంబియన్స్‌తో రూపొందించబడు తుందని తెలుస్తోంది. ఇప్పటికే ఉన్న గచ్చిబౌలి ఏఎంబీ సినిమాస్‌కి మించి, మరింత అద్భుతమైన అనుభూతి అందించేందుకు ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ మల్టీప్లెక్స్ ప్రారంభ వేడుకకు సంబంధించి ఓ ప్రత్యేకత ఉంది. సంక్రాంతి 2026లో విడుదల కానున్న మెగాస్టార్ చిరంజీవి %-% అనిల్ రావిపూడి కాంబోలో వస్తున్న "మన శంకర వరప్రసాద్ గారు" సినిమా ఈ థియేటర్‌లో తొలిసారిగా స్క్రీనింగ్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.సంక్రాంతి సీజన్‌లో ఈ మల్టీప్లెక్స్ 30-40 షోలు వేశాక, ఒక్క సినిమా నుంచే కోటి రూపాయల పైగా వసూళ్లు రావచ్చని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దీంతో బాబు థియేటర్ జర్నీలో మరో అద్భుతం నమోదయ్యే అవకాశం ఉంది. సినిమాలకి గుండెకాయగా పేరొందిన %=ుజ% క్రాస్ రోడ్స్ ప్రాంతంలోనే ఈ కొత్త మల్టీప్లెక్స్ నిర్మాణం జరగడం విశేషం. ఇప్పటికే ఉన్న ప్రముఖ థియేటర్లకు గట్టి పోటీగా ఈ బ్రాండ్ నిలవనుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.

# 'మిస్ యూ అన్నా'.. 'కాంతార2'లో కడుపుబ్బా నవ్వించిన ఈ నటుడు ఎలా కన్నుమూశాడో తెలుసా?

సుమారు మూడేళ్ల క్రితం రిలీజై సంచలన విజయం సాధించిన కాంతార సినిమాకు ప్రీక్వెల్ గా తెరకెక్కిన సినిమా కాంతారా ఛాప్టర్ 1. మొదటి భాగాన్ని తెరకెక్కించిన రిషభ్ శెట్టినే రెండో పార్ట్ కు కూడా దర్శకత్వం వహించాడు. అంతే కాదు సినిమాలో మెయిన్ లీడ్ పోషించాడు. దసరా కానుకగా అక్టోబర్ 02న రిలీజైన ఈ డివోషనల్ డ్రామా బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్లు రాబడుతోంది. ఇప్పటికే ఈ మూవీ రూ.300 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించింది. హొంబలే ఫిల్మ్స్ సంస్థ తెరకెక్కించిన కాంతార 2 సినిమాలో రుక్మిణీ వసంత్ కథానాయికగా నటించింది.అలాగే బాలీవుడ్ ప్రముఖ నటుడు గుల్షన్ దేవయ్య ప్రతినాయకుడి పాత్రలో కనిపించారు. ఇదే సినిమాలో ఓ ప్రముఖ కమెడియన్ కూడా నటించాడు. సినిమా చూసిన వారందరూ అతని నటనను ప్రశంసిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. అదే సమయంలో అతనికి నివాళి అర్పిస్తూ కాంప్లిమెంట్స్ ఇస్తున్నారు. ఎందుకంటే ఆ నటుడు కొన్ని రోజుల క్రితమే గుండె పోటుతో కన్నుమూశాడు.కాంతార చాప్టర్-1 సినిమా చూసిన వారందరూ నటుడు రాకేశ్ పూజారి నటన అద్భుతంగా ఉందంటూ కాంప్లిమెంట్స్ ఇస్తున్నారు. అయితే 34 ఈ నటుడు ఈ ఏడాది మే 13న గుండెపోటుతో మరణించారు. కర్ణాటకలోని ఉడుపి జిల్లాలో తన స్నేహితులు నిర్వహించిన ఓ మెహందీ వేడుకలో రాకేశ్ పాల్గొన్నాడు. అక్కడ డ్యాన్స్ గుండె పోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఆస్పత్రికి చేర్పించేలోపే అతను తుదిశ్వాస విడిచాడు.



# యూరప్‌కి 'రాజాసాబ్'




ప్రభాస్‌హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ది రాజాసాబ్' సంక్రాంతి బరిలో సందడి చేయనుంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పాన్ ఇండియాగా నిర్మిస్తున్న ఈ చిత్రం జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ కథానాయికలు. సంజయ్ దత్ ముఖ్య కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ చివర దశలో ఉంది. ఈ వారం నుంచి యూరప్‌లో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించనున్నారు. దీనికోసం చిత్ర బృందం ఇప్పటికే అక్కడికి చేరుకుంది. ఈ షెడ్యూల్‌లో నాయకానాయికలపై రెండు పాటలు చిత్రీకరించనున్నారు. మరోవైపు నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో ప్రభాస్ రెండు భిన్నమైన కోణాల్లో కనిపిస్తారు. మూడు నెలల ముందే ఈ సినిమా ట్రైలర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. విజువల్‌గా ఈ ట్రైలర్ ప్రేక్షకులను మెస్మరైజ్ చేసింది. వింటేజ్ లుక్ లో ప్రభాస్ వెర్సటైల్‌గా కనిపించి ఆకట్టుకున్నారు. తమన్ బీజీఎంలోని వేరియేషన్స్ రాజా సాబ్ ట్రైలర్‌కు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచాయి. మొత్తం మీదగా ఈ ట్రైలర్ 40 మిలియన్ల డిజిటల్ వ్యూస్ సాధించి ట్రెండింగ్‌లో ఉంది.

# ఆ అందానికి ముగ్దులు అవ్వాల్సిందే మతిపోగొట్టేస్తోన్న అనుపమ



అనుపమ పరమేశ్వరన్... సౌత్ సినీప్రియులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని పేరు. తక్కువ సమయంలోనే తనకంటూ ఓ ఇమేజ్ క్రియేట్ చేసుకున్న ఈ కేరళ కుట్టి.. ఇప్పుడు బ్యాక్ టూ బ్యాక్ సినిమాలతో అలరిస్తుంది. ఈ ఏడాది అనుపమ నటించిన చిత్రాలన్నీ బాక్సాఫీస్ వద్ద హిట్టయ్యాయి. తాజాగా సోషల్ మీడియాలో ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ తెగ ఆకట్టుకుంటున్నాయి. 2015లో ప్రేమమ్ సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టింది అనుపమ పరమేశ్వరన్. మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. అందులో హీరోయిన్ కాదు.. కేవలం ఐదు నిమిషాల స్క్రీన్ స్పేస్ కూడా లేని అతిథి పాత్రలో మాత్రమే కనిపించింది. 2015లో ప్రేమమ్ సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టింది అనుపమ పరమేశ్వరన్. మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. అందులో హీరోయిన్ కాదు.. కేవలం ఐదు నిమిషాల స్క్రీన్ స్పేస్ కూడా లేని అతిథి పాత్రలో మాత్రమే కనిపించింది.ఆ తర్వాత తెలుగులో అఆ సినిమాతో తెరంగేట్రం చేసింది. ఇందులోనూ హీరోయిన్ పాత్ర కాదు. శర్వానంద్ నటించిన శతమానం భవతి సినిమాతో కథానాయికగా పరిచయమైంది. తెలుగులో వరుస సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంటుంది. ఆ తర్వాత తెలుగులో అఆ సినిమాతో తెరంగేట్రం చేసింది. ఇందులోనూ హీరోయిన్ పాత్ర కాదు. శర్వానంద్ నటించిన శతమానం భవతి సినిమాతో కథానాయికగా పరిచయమైంది. తెలుగులో వరుస సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంటుంది. మలయాళంలో ప్రేమమ్ సినిమా తర్వాత ఆమెకు పూర్తి నిడివి ఉన్న పాత్ర రాలేదు. దాదాపు 15 సంవత్సరాల తర్వాత ఇటీవల జానకి వర్సెస్ కేరళ సినిమాలో నటించింది. విడుదలకు ముందే ఈ మూవీ వివాదాల్లో చిక్కుకుంది. మలయాళంలో ప్రేమమ్ సినిమా తర్వాత ఆమెకు పూర్తి నిడివి ఉన్న పాత్ర రాలేదు. దాదాపు 15 సంవత్సరాల తర్వాత ఇటీవల జానకి వర్సెస్ కేరళ సినిమాలో నటించింది. విడుదలకు ముందే ఈ మూవీ వివాదాల్లో ఇటీవలే తెలుగులో కిష్కింధపురి, పరదా చిత్రాల్లో నటించి మెప్పించింది.ఈ రెండు చిత్రాలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు ఈ అమ్మడు మరిన్ని ఆఫర్స్ కోసం వెయిట్ చేస్తుంది. అలాగే సోషల్ మీడియాలోనూ చాలా యాక్టివ్ గా ఉంటుంది.ఇటీవలే తెలుగులో కిష్కింధపురి, పరదా చిత్రాల్లో నటించి మెప్పించింది. ఈ రెండు చిత్రాలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు ఈ అమ్మడు మరిన్ని ఆఫర్స్ కోసం వెయిట్ చేస్తుంది. అలాగే సోషల్ మీడియాలోనూ చాలా యాక్టివ్ గా ఉంటుంది.తాజాగా ఈ అమ్మడు నెట్టింట షేర్ చేసిన ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. మోడ్రన్ చుడిధార్ లో.. రింగుల జుట్టులో ఎంతో అందంగా కనిపిస్తుంది. ప్రస్తుతం అనుపమ లేటేస్ట్ ఫోటోస్ చూసి అడియన్స్ ఫిదా అవుతున్నారు. తాజాగా ఈ అమ్మడు నెట్టింట షేర్ చేసిన ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. మోడ్రన్ చుడిధార్ లో.. రింగుల జుట్టులో ఎంతో అందంగా కనిపిస్తుంది. ప్రస్తుతం అనుపమ లేటేస్ట్ ఫోటోస్ చూసి అడియన్స్ ఫిదా అవుతున్నారు.


# కంబ్యాక్ గ్యారెంటీ.. వరుణ్ సందేశ్



హ్యాపీడేస్ సినిమాతో హీరోగా పరిచయమైన వరుణ్ సందేశ్ ఆ తర్వాత కొత్త బంగారు లోకం సినిమాతో సూపర్ హిట్ అందుకున్నాడు. ఈ సినిమాతో వరుణ్ కు మంచి ఫాలోయింగ్ వచ్చేసింది. కానీ ఆ తర్వాత అతడు నటించిన చిత్రాలన్ని డిజాస్టర్స్ అయ్యాయి.దీంతో కొన్నాళ్లపాటు సినిమాలకు దూరంగా ఉన్నాడు. ఇప్పుడిప్పుడే తిరిగి సినిమాల్లో నటిస్తున్న వరుణ్.. తాజాగా తన కొత్త సినిమాను అనౌన్స్ చేశాడువరుణ్ సందేశ్, మధులిక వారణాసి జంటగా తెరకెక్కుతున్న చిత్రం "కానిస్టేబుల్". జాగృతి మూవీ మేకర్స్ పతాకంపై ఆర్యన్ సుభాన్ ఎస్.కె. దర్శకత్వంలో బలగం జగదీశ్ నిర్మిస్తున్నారు. విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఈ చిత్రంలోని ఓ ఐటమ్ సాంగ్ ను తెలుగు ఫిలిం ఛాంబర్ ప్రెసిడెంట్ భరత్ భూషణ్ చేతులమీదుగా విడుదల చేశారు. అనంతరం భరత్ భూషణ్ స్పందిస్తూ, చిత్రం విజయవంతం కావాలని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హీరో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ, సెన్సార్ విజయవంతంగా పూర్తి చేసుకుని సర్టిఫికెట్ పొందడం చాలా సంతోషంగా ఉంది. నా కెరీర్ కు ఈ చిత్రం మరో మలుపు అవుతుందని అన్నారు.నిర్మాత బలగం జగదీష్ మాట్లాడుతూ, సెన్సార్ పూర్తి కావడం, అలాగే ట్రైలర్ కి వచ్చిన స్పందన నాకు చాలా సంతోషాన్ని కలిగించింది. ఈ నెల్ల 10న ఇలాంటి ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల తీర్పు కోసం వస్తున్నామని చెప్పారు. అలాగే ఇందులోని ఒక మంచి ఐటమ్ సాంగ్‌ను దసరా సందర్భంగా విడుదల చేశాం. దానికి కూడా మంచి స్పందన రావడం సంతోషంగా ఉందన్నారు.ఇది కూడా చదవండి :ఒకే ఒక్క డిజాస్టర్ పడింది..! దెబ్బకు ఏడాదికి పైగా కనిపించకుండా పోయింది.దర్శకుడు ఆర్యన్ సుభాన్ %ాఖ% మాట్లాడుతూ, సినిమా అద్భుతంగా రూపుదిద్దుకుంది. ట్రైలర్ కు వచ్చిన స్పందనతోనే మేము సగం విజయం సాధించామని అనుకుంటున్నాం. 50 లక్షల మంది ట్రైలర్ చూడడం అంటే అది మామూలు విషయం కాదని అన్నారు. ఈ చిత్రంలోని ఇతర ముఖ్య పాత్రలలో దువ్వాసి మోహన్, సూర్య, రవి వర్మ, మురళీధర్ గౌడ్, బలగం జగదీష్, ప్రభావతి, కల్పలత, నిత్య శ్రీ, శ్రీ భవ్య తదితరులు తారాగణం.

# హీరో విజయ్ దేవరకొండ కారుకు యాక్సిడెంట్

టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ కారు ప్రమాదానికి గురైంది. జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి సమీపంలో ఈ ఘటన జరిగింది. ఆదివారం (అక్టోబర్ 05) తన స్నేహితులతో కలిసి కారులో పుట్ట పర్తికి వెళ్లాడు విజయ్ దేవరకొండ. సోమవారం (అక్టోబర్ 06) హైదరాబాద్ కు తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. విజయ్ దేవరకొండ కారును.. బొలెరో వాహనం ఢీకొట్టడంతో ఈ యాక్సిడెంట్ జరిగింది. అయితే ఈ ప్రమాదం నుంచి విజయ్ దేవరకొండ సురక్షితంగా బయటపడ్డాడు. ప్రమాదంలో విజయ్ కారు స్వల్పంగా దెబ్బతిన్నట్లు సమాచారం. ప్రమాదం తర్వాత విజయ్ తన స్నేహితుడి కారులో హైదరాబాద్ వెళ్లిపోయాడు. కాగా ఇటీవల రష్మికతో విజయ్ దేవరకొండ ఎంగేజ్ మెంట్ జరిగినట్లు ప్రచారం జరిగింది. గతంలో వీరి కాంబోలో వచ్చిన ట్యాక్సీవాలా సూపర్ హిట్ గా నిలిచింది. రాయలసీమ నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. దీని తర్వాత దిల్ రాజు బ్యానర్ లో రౌడీ జనార్దన్ అనే సినిమాకు కమిట్ అయ్యాడీ రౌడీ హీరో. వి.కిరణ్ కోలా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. దీంతో పాటు మరికొన్ని సినిమాలకు విజయ్ దేవరకొండ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ సినిమాల గురించి మరిన్ని అప్ డేట్స్ రానున్నాయి.



Editor, printer, published Owned by CHINTHALA RAMAKRISHNA Gummadidala (M&V) SANGAREDDY DIST TELANGANA State 502313 ph 8499902850/RNI NO:TELTEL/2022/81794